జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన
నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?
మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్...
రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది
వివరాలకు సంప్రదించండి 8886022523


సంపుటి 7 సంచిక 152 | హైదరాబాద్, ఆగష్టు 15 మంగళవారం 2023 | 8 పేజీలు | వెల : 5.00

## లక్షలోపు
# రైతు రుణాలు మాఫీ



హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు తెలంగాణ రైతాంగానికి ప్రభుత్వం శుభవార్తను చెప్పింది. ఇచ్చిన హామీ మేరకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం రూ.లక్షలోపు రుణమాఫీ చేసింది. సోమవారం ఒకే రోజు 10,79,721 మంది రైతుల రూ.6,546,05 కోట్ల రుణాలను మాఫీ చేసింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వం రుణమాఫీని పూర్తి చేసింది. ఇప్పటి వరకు 16.16లక్షల మంది రైతులకు చెందిన రూ.7,753కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. ఈ నెల 2న జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో రుణమాఫీపై నిర్ణయం తీసుకున్న సీఎం కేసీఆర్.. ఆగస్టు 3 నుంచి రైతుమాఫీని ప్రారంభించాలని ఆర్థికమంత్రి హరీశ్‌రావు, అధికారులను ఆదేశించారు. తెలంగాణ రైతాంగ సంక్షేమం వ్యవసాయాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఎన్నికష్టాలొచ్చినా రైతుల సంక్షేమం కోసం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. రుణమాఫీలో ప్రక్రియ 3న ప్రారంభం కాగా.. తొలిరోజు రూ.41వేల లోపు 62,758 మంది రైతుల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. విడుదల వారీగా రైతుల రుణాలను మాఫీ చేస్తూ వచ్చిన ప్రభుత్వం.. మిగతా రైతుల రుణాలను సోమవారం ఒకేసారి రూ.99,999 లోపు ఉన్న 10.79లక్షల మంది రైతుల రూ.6,546.05కోట్లను మాఫీ చేసింది. ఇచ్చిన మాట మేరకు రుణమాఫీ చేసిన సీఎం కేసీఆర్‌కు రైతాంగం ధన్యవాదాలు తెలుపుతున్నది.

## రైతుబంధు ఇవ్వాలన్న ఆలోచన
# కాంగ్రెస్ రాబందులకు వచ్చిందా..?
### నిప్పులు చెరిగిన మంత్రి కేటీఆర్



కామారెడ్డి : రైతుబంధు ఇవ్వాలన్న ఆలోచన కాంగ్రెస్ రాబందులకు ఎప్పుడైనా వచ్చిందా..? అని రాష్ట్ర మంత్రి కేటీఆర్ నిప్పులు చెరిగారు. పది సార్లు ఓట్లేస్తే.. 50 ఏండ్లు కాంగ్రెస్ ఏలింది. కరెంట్ ఎప్పుడన్న సక్కగ ఇచ్చిందా..? మూడు గంటల కరెంట్ చాలని రేవంత్ రెడ్డి అమెరికా సాక్షిగా బయటపెట్టిండు. ఈ విషయాన్ని ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని రైతన్న ఆలోచించాలి అని కేటీఆర్ సూచించారు. ఎల్లారెడ్డిలో నిర్వహించిన బీఆర్ఎస్ బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

తెలంగాణ రాకముందు కరెంట్ ఎట్ల ఉండే.. ఇప్పుడెలా ఉందో ఆలోచించాలన్నారు కేటీఆర్. ఎరువులు పంచే తెలివిలేదు. విత్తనాలు ఇచ్చే ముఖం లేదు. ఆఖరికి పోలీసు స్టేషన్లలో విత్తనాలు పంచిన దౌర్భాగ్యపు పాలన కాంగ్రెస్‌ది. నాడు పేలిపోయే ట్రాన్స్‌పార్మర్లు, కాలిపోయే మోటార్లు.. నెర్రెలు బారిన నేలలు.. నెత్తురు కారిన నేలలు.. నాడు తీవ్రమైన దుర్భిక్షం. ఇవాళ ఎక్కడా చూసినా పంటలతో తెలంగాణ పచ్చగా కళకళలాడుతోంది. భూగర్భ జలాలు పెరిగాయి. వ్యవసాయానికి సాగునీరు, 24 గంటల కరెంట్ అందుతుంది అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## గ్యాలంటరీ అవార్డులకు...
# రాష్ట్రపతి ఆమోదం
### నలుగురికి కీర్తిచక్ర..!




ఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సాయుధ దళాలకు కేంద్రం గ్యాలంటరీ అవార్డులను ప్రకటించింది. సాయుధ దళాలకు ఇచ్చే 76 మంది గ్యాలంటరీ అవార్డులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ఆమోదం తెలిపారు. ఇందులో నాలుగు కీర్తిచక్ర (మరణానంతరం), 11 శౌర్య చక్ర అవార్డులు ప్రకటించింది. ఇందులో మరణానంతరం ఐదుగురికి కీర్తిచక్ర ఇవ్వనున్నది. 52 మందికి సేవా పతకాలను ముగ్గురికి నౌ సేనా పతకాలు, నలుగురు వాయుసేన పతకాలను ఇచ్చేందుకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. అలాగే విధుల్లో అసాధారణమైన సేవలు అందించిన భారత కోస్ట్ గార్డ్ సిబ్బందికి రాష్ట్రపతి తత్రరక్షక్ పతకం, ఐదు తత్రరక్షక్ పతకాలకు సైతం రాష్ట్రపతి ఆమోదం తెలిపారు.

జైళ్లశాఖ సిబ్బందికి సేవా పతకాలు

జైళ్లశాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి సేవా పతకాలను కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ప్రకటించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పతకాలను ప్రకటించగా.. రాష్ట్రం నుంచి నలుగురికి అవార్డులు వరించాయి. డీఎస్పీ గౌరి రామచంద్రన్, డిప్యూటీ జైలర్ చెరుకూరి విజయ్, అదనపు డిప్యూటీ జైలర్ సీహెచ్ కైలాశ్, హెడ్ వార్డర్ మల్లారెడ్డికి పతకాలకు ఎంపికయ్యారు.

# వారణాసిలో మోదీ ఓటమి ఖాయం..!




ముంబై: కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తారనే ఊహాగానాల నేపథ్యంలో శివసేన ఉద్ధవ్ థాకరే వర్గం నేత సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి నియోజకవర్గమైన వారణాసి నుంచి ఆయనపై ప్రియాంక పోటీ చేస్తే ఆవె గెలుపొందడం ఖాయమని జోస్యం చెప్పారు. వారణాసి ప్రజలు ప్రియాంకను కోరుకుంటున్నారని, ఆమె కనుక ప్రధానిపై వారణాసి నుంచి పోటీ చేస్తే గెలుపు ఆమెనే వరిస్తుందని అన్నారు. ఈసారి రాయబరేలి, వారణాసి, అమేథిలో బీజేపీ గట్టి పోటీని ఎదుర్కొంటుందని చెప్పారు.

పవార్ ద్వయం ఎందుకు కలుసుకోకూడదు?

ఎన్‌సీపీ చీఫ్ అజిత్ పవార్, ఆయన మేనల్లుడు, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ఇటీవల సమావేశం కావడంపై సంజయ్ రౌత్ మాట్లాడుతూ, పాకిస్తాన్ మాజీ ప్రధాని నవాజ్‌షరీఫ్, నరేంద్ర మోదీ కలుసుకున్నప్పుడు శరద్ పవార్, అజిత్ పవార్ ఎందుకు కలుసుకోకూడదని ప్రశ్నించారు. వారిద్దరూ సమావేశమైన విషయం మీడియా ద్వారానే తనకు తెలిసిందని, బహుశా విపక్ష కూటమి I.N.D.I.A సమావేశానికి రావాలని అజిత్ పవార్‌ను శరద్ పవార్ ఆహ్వానించి ఉండవచ్చని అన్నారు. మహారాష్ట్రలోని ప్రస్తుత ప్రభుత్వంపై ఇద్దరు డిప్యూటీ సీఎంలు సంతోషంగా లేరని కూడా రౌత్ వ్యాఖ్యానించారు.

**ప్రియాంక ఎక్కడ పోటీ చేయాలనేది పార్టీ ఇష్టం: వాద్రా**

కాగా, లోక్‌సభ ఎన్నికల్లో ప్రియాంక పోటీపై ఆమె భర్త రాబర్ట్ వాద్రా మాట్లాడుతూ, ప్రియాంక పార్లమెంటులో అడుగుపెట్టాలని తాను అనుకుంటున్నానని, ఆమె లోక్‌సభలో అడుగుపెట్టాలని ప్రజలు కూడా కోరుకుంటే అది జరుగుతుందని అన్నారు. అమేథీ నుంచి పోటీ చేస్తారా సుల్తాన్‌పూర్ నుంచి పోటీ చేస్తారా అనేది పార్టీ నిర్ణయించాల్సి ఉంటుందన్నారు.

# మూగబోయిన గొంతుకు రాగ మెత్తుదాం.. రండి...!


గద్దరన్న సంస్మరణ సభ
మట్టుపల్లి సుబ్బరాయుడు
ఆర్ పి ఐ. సౌత్ ఇండియా ప్రధాన కార్యదర్శి



16 - 08 - 23 బుధవారం మధ్యాహ్నం 2 గం" నుండి సుందరయ్య కళ విజ్ఞాన కేంద్రం . బాగిలింగంపల్లి. హైదరాబాద్. నందు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథావలె) అద్వర్యం లో ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ దక్షణాది రాష్ట్ర ల ప్రధాన కార్యదర్శి మరియు భీమ్ రక్ష ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మట్టుపల్లి సుబ్బరాయుడు తెలిపారు -జననాట్య మండలి అవిర్భావకుడు, - ప్రజా సాంస్కృతిక విప్లవ యోదుడు, గద్దర్ అన్న ఆట,పాటల ద్వారా దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలకు స్ఫూర్తి నిచ్చిన గద్దర్ అన్నా రచయితగా, గాయకుడుగా, వాగ్గేయ కారుడుగా పౌరహక్కులను కాపాడటంలోను, ఆదివాసి, దళిత, మైనారిటి పీడిత ప్రజల గొంతుక గద్దర్ అన్నా అని వారి సంస్మరణ సభకి పార్టీలకు అతీతంగా కవులు కళాకారులు. ఉద్యమకారు అంబేద్కరిస్థులంతా కలిసి రావాలని గద్దర్ అన్నా కి నివాళులర్పించని మట్టుపల్లి సుబ్బరాయుడు విజ్ఞప్తి చేశారు.

# మెదక్ కమలంలో లీడర్ల వేట..

సంగారెడ్డి, ఆగస్టు 14 : తెలంగాణ వ్యాప్తంగా దూసుకుపోవాలని కమలం పార్టీ పెద్దలు ఇప్పటికే నేతలకు సూచనలు చేశారు. దీంతో బీజేపీలోని పెద్ద నేతలంతా ఆ ఆలోచనతో ముందుకు వెళ్తుంటే.. ఆ నియోజకవర్గ బీజేపీ నేతలు మాత్రం చాలా సైలెంట్ అయ్యారట. గత కొద్దిరోజుల క్రితం హడావుడి చేసిన నేతలు, ఇప్పుడు అసలు నియోజకవర్గాన్ని పట్టించుకోవడమే లేదట.. దీంతో అక్కడ బీజేపీ పార్టీ ఉందా లేదా అనే అనుమానాలు వస్తున్నాయని.. టాక్ వినిపిస్తోంది. ఇంతకి అది ఏ నియోజకవర్గం.. ఎవరా.. నేత అనే వివరాలు తెలుసుకోండి.. సంగారెడ్డి.. ఆందోల్-జోగిపేట నియోజకవర్గం లోని కమలం పార్టీకి అర్జెంట్ గా లీడర్ల కావాలంట.. గత కొద్దిరోజులుగా పార్టీని నడిపే లీడర్ల లేకపోవడంతో కార్యకర్తలందరూ నైరాశ్యంలో ఉన్నారట.. ఆందోల్-జోగిపేట బీజేపీ పార్టీలో లీడర్లు లేరా అంటే.. గట్టి నేతలే ఉన్నారు.. కానీ,ఈ మధ్య కాలంలో నియోజకవర్గన్ని అసలు పట్టించుకోవడం లేదట.. ఒకప్పుడు




నాయకత్వం కోసం కొట్టుకున్న లీడర్లు ఇప్పుడు అస్సలు పార్టీని పట్టించుకోవడం లేదని టాక్ వినిపిస్తోంది. ఆందోల్ నియోజకవర్గ బీజేపీలో సీనియర్ లీడర్ బాబుమోహన్.. ఈయన నియోజకవర్గంలో కనిపించక చాలా రోజులైందట.. అందోల్ బీజేపీ నేతలకు టచ్‌లో కూడా లేరని బహిరంగంగా పేర్కొంటున్నారు బీజేపీ నేతలు..ఆందోల్ బాబూ మోహన్‌తోపాటు మరో నేత ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ జెడ్పి చైర్మన్ బాలయ్య.. వీరిద్దరు అందోల్ బీజేపీలో సీనియర్ లీడర్లు ఇప్పుడు వీరిద్దరు పార్టీని పట్టించుకోవడం లేదని సొంత పార్టీ క్యాడరే పేర్కొంటుండం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మొదట నియోజకవర్గ పరిధిలో బాబుమోహన్ బాగానే తిరిగే వారు.. అయితే అదే సమయంలో బాలయ్య బీజేపీ పార్టీలోకి రావడంతో ఇద్దరి మధ్య గొడవలు అయ్యాయట. ఏ కార్యక్రమం చేసిన ఎవరికి వారే చేసేవారట..అలాంటి నేతలు ఇప్పుడు నియోజక వర్గంలో కన్పిస్తాలేరని పేర్కొంటున్నారు. వీరిద్దరి తీరు ఉంటే ఉగాది లేకుంటే శివరాత్రి అన్నట్లుగా మారిందట.. ఒకప్పుడు ఆధిపత్యం కోసం కొట్టుకున్న ఈ ఇద్దరు నేతలు.. ఇప్పుడు ఉన్న అవకాశాన్ని కూడా చేజార్చుకుంటున్నట్లు తెలుస్తోంది.నియోజకవర్గ పరిధిలో ఉన్న బీజేపీ కార్యకర్తలను ముందుకు నడిపే లీడర్ల లేకపోవడంతో వాళ్ళు కూడా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారట.. ఇటీవల కాలంలో బీజేపీ అధినాయకత్వం ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చిన కూడా అందోల్-జోగిపేట్ నియోజకవర్గ పరిధిలోని జరగడం లేదట.. మొన్నటికి మొన్న బీజేపీ టిఫిన్ కార్యక్రమం నిర్వహించినప్పుడు కూడా ఉమ్మడి జిల్లాలో అన్ని నియోజక వర్గాల్లో జరిగాయి.. కానీ అందోల్-జోగిపేట్ లో మాత్రం టిఫిన్ భైటో కార్యక్రమం జరగలేదట.. అధికార పార్టీపై నిరసన కార్యక్రమాలు చేయడానికి కూడా ఈ లీడర్లు రావడం లేదని సొంత క్యాడరే విమర్శిస్తుండటం ఇప్పుడు పెద్ద తలనొప్పిగా మారింది.ఇతర ప్రతిపక్ష నేతలు అధికార పార్టీపై నిరసనలు తెలుపుతూ ఏదో ఒక కార్యక్రమం చేస్తుంటే.. బీజేపీ మాత్రం ఏం చేయలేదంటూ సొంత కార్యకర్తలు చెబుతుతుండటం చర్చనీయాంశంగా మారింది. పార్టీ కోసం పనిచేసే క్యాడర్ ఉన్న కూడా వారికి దిశ నిర్ధేశం చేసే నేతలు కరువైనరని ఆందోల్ బీజేపీలో ఆందోళన మొదలైంది. గతంలో ఒకే పార్టీలో ఉన్నప్పటికీ బాబుమోహన్, బాలయ్యకి ఇద్దరికి పడక ఎప్పుడూ ఏదో ఒక గొడవ పెట్టుకునేవారు.. ఆ సమయంలో ఎవరి వైపు ఉండాలో అర్ధం కాక అగమయ్యాము.. ఇప్పుడు దిశానిర్దేశం చేసే లీడర్ లేక ఇలా ఆగం అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారట అందోల్ బీజేపీ క్యాడర్..బాబు మోహన్ లాంటి సినియర్ లీడర్ కూడా పార్టీని పట్టించుకొకపోతే.. మున్ముందు ఎలా అని కార్యకర్తలు బహిరంగంగా పేర్కొంటున్నారు. బాలయ్య ఎంట్రీ బాబుమోహన్ కి ఇష్టం లేదు.. అయిన సరే కొద్దీరోజులు ఇద్దరు ఎవరికి వారు నియోజకవర్గ పర్యటనలు చేశారు.. కానీ ఒకేసారి ఇద్దరూ కూడా నియోజకవర్గాన్ని పట్టించుకోక పోవడం.. మరోవైపు ఎన్నికలు దగ్గర పడుతుండటం పార్టీ క్యాడర్లో అయోమయం నెలకొంది.

# సౌత్ తెలంగాణలో సీట్లు..

## కామ్రేడ్లతో కలిసి అడుగులు

కరీంనగర్, ఆగస్టు 14, : తెలంగాణ సీఎం కేసీఆర్ కమ్యూనిస్టులతో కలిసి పోటీ చేయాలని ఫైనల్‌గా నిర్ణయించుకున్నారని బీఆర్ఎస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. హుజూరాబాద్ ఉపఎన్నికల సమయంలో కమ్యూనిస్టులతో పొత్తులు పెట్టుకున్నారు. ఆ పార్టీకి ఆ నియోజకవర్గంలో సాలిడ్ ఓటు బ్యాంక్ ఉండటంతో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించింది. అయితే ఆ తర్వాత కమ్యూనిస్టులతో కమ్యూనికేషన్ ను కేసీఆర్ నిలిపివేశారు. ఈ అంశంపై కమ్యూనిస్టుపార్టీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు కూడా. అయితే మళ్లీ కేసీఆర్ మనసు మార్చుకున్నారని.. కమ్యూనిస్టులతో పొత్తులకు సిద్ధమవుతున్నారన్న సంకేతాలు వస్తున్నాయి. కేసీఆర్ పొత్తుపై ఇప్పటి వరకు కమ్యూనిస్టు పార్టీలకు ఎలాంటి సందేశాలు ఇవ్వలేదు. మునుగోడు ఉప ఎన్నికల్లో గెలుపు కోసం మాత్రం ఆనాడు ఉన్న రాజకీయ పరిస్థితుల దృష్ట్యా అధినేత కేసీఆర్ నుంచి పిలుపును అందుకున్నారని గులాబీ వర్గాలు తెలుపుతున్నాయి. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపొందడం వెనుక సీపీఐ, సీపీఎం ఓట్లే కారణమన్న అభిప్రాయాన్ని అన్ని పార్టీల నేతలు వ్యక్తం చేశారు. బీజేపీ నుంచి పోటీ చేసిన అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సైతం తన ఓటమికి ప్రధాన కారణం కమ్యూనిస్టులే అని బహిరంగంగా ప్రకటించారు. అప్పుడే అసెంబ్లీ ఎన్నికల్లోనూ కలిసి పని చేస్తామని.. అంతే కాదు దేశంలో కూడా కలిసి పనిచేస్తామన్నారు. కానీ ఇప్పుడు చాలా సార్లు ఉభయ కమ్యూనిస్టు పార్టీలు సీఎం కేసీఆర్ అపాయింట్‌మెంట్ కోరినా వారికి అధినేత ఇవ్వలేదని సమాచారం. పొత్తులపై ఏదో ఒక్కటి తేల్చండి.. మా దారి మేము చూసుకుంటామని గత నెల నుంచి సీపీఐ, సీపీఎం నేతలు బహిరంగంగానే స్వరం పెంచారు. ఇప్పటికి వారికి ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.దక్షిణ తెలంగాణను దృష్టిలో పెట్టుకొని అధినేత కేసీఆర్ కమ్యూనిస్టు పార్టీలతో పొత్తు పొట్టుకోవచ్చా లేదా అన్న సమాలోచనలు చేస్తున్నారు. సీపీఐ, సీపీఎం పార్టీలకు నమ్మకమైన ఓటు బ్యాంక్ ఉంటుంది. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కాంగ్రెస్ ప్రభావం చూపించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు అధినేత అంచనా వేస్తున్నారు. ఈ సారి కూడా కనీసం మెజార్టీ స్థానాలు దక్కించుకోవాలని చూస్తున్నారు. ఖమ్మంజిల్లాలో గత రెండు ఎన్నికల్లోనూ ఒక్క సీటు కంటే ఎక్కువ దక్కించకోలేకపోయారు. క్కడ తక్కువలో తక్కువగా ప్రతి నియోజకవర్గంలో 5 వేల వరకు ఓట్లు ఉభయ కమ్యూనిస్టు పార్టీలకు ఉన్నాయి. ఈ ఓట్లు గెలు పోటముల్ని తేలుస్తాయని నమ్ముతున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హ్యాండిస్తే కమ్యూనిస్టులు ఖచ్చితంగా కాంగ్రెస్ పార్టీతోనే వెళ్తారు. జాతీయ స్థాయిలో వారు కూటమిలో భాగంగా ఉన్నారు. కమ్యూనిస్టుల ఓట్లు కాంగ్రెస్‌కు మేలు చేస్తాయి. ఇది బీఆర్ఎస్ చీఫ్‌కు ఇష్టం లేదు. అందుకే వారిని వదులుకోవడం ఎందుకన్న ఆలోచన చేస్తున్నారని అంటున్నారు. పొత్తులో భాగంగా చెరి మూడు స్థానాలను సీపీఐ, సీపీఎం కోరుతున్నాయి. కమ్యూనిస్టులు కోరుతున్న అన్ని స్థానాల్లోనూ గులాబీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్నారు. పొత్తు పెట్టుకుంటే బీఆర్ఎస్‌కు ఎంత శాతం ఓట్లు పడే అవకాశం ఉంది. ఏఏ స్థానాల్లో వారితో పొత్తు కలిసి రానుంది. అని కేసీఆర్ లాభ నష్టాల అంచనాల్లో ఉన్నారని చెబుతున్నారు. మొత్తంగా వారంలో పొత్తులపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# కాంగ్రెస్ గూటికి చంద్రశేఖర్

హైదరాబాద్, ఆగస్టు 14, :తెలంగాణ బీజేపీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి డాక్టర్ ఏ.చంద్రశేఖర్ కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈయన మంత్రిగా పని చేసిన సంగతి తెలిసిందే. 2021లో బీజేపీలో చేరిన ఆయన తనకు అక్కడ ప్రాధాన్యం దక్కడం లేదని అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ పని అయిపోయిందని, బీఆర్ఎస్ ను బీజేపీనే కాపాడుతోందని అన్నారు. ఇక తెలంగాణలో బీఆర్ఎస్ కు కాంగ్రెస్సే ప్రత్యామ్నాయం అని అన్నారు. తెలంగాణలో బీజేపీని ఓ స్థాయికి తీసుకురావడానికి బండి సంజయ్ చాలా పని చేశారని, కుటుంబాన్ని కూడా పట్టించుకోకుండా పని చేశారని చంద్రశేఖర్ గుర్తు చేశారు. అలాంటి బండి సంజయ్‌కు అధ్యక్ష పదవి నుంచి తప్పించి తప్పు చేశారని అన్నారు. దీంతో ఇక బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని గ్రామస్థాయిలో కూడా చర్చ జరుగుతుందని అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో బీజేపీ మూడో స్థానానికి వెళ్లిపోయిందని అన్నారు. బండి సంజయ్ కు జాతీయ కార్యదర్శి పదవి ఇచ్చాక ఆయన సంతృప్తిగా ఉన్నారో లేదో ప్రశ్నించుకోవాలని అన్నారు. బండి సంజయ్ లా కష్టపడే నాయకులకి బీజేపీలో చోటు లేదని అన్నారు.చంద్రశేఖర్ ను ఈటల రాజేందర్ బుజ్జగించే ప్రయత్నం చేసినా ఆయన మనసు మార్చుకోలేదు. బీజేపీ నాయకత్వం తీరుపై అసంతృప్తితో ఉన్న చంద్రశేఖర్ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. వికారాబాద్‌లో 2021 జనవరి 18న నిర్వహించిన బహిరంగ సభలో అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, పార్టీ ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్ సమక్షంలో చంద్రశేఖర్ బీజేపీలో చేరారు.చంద్రశేఖర్‌కు సముచిత స్థానం కల్పిస్తామని అప్పట్లో ముఖ్య నేతల హామీ ఇచ్చారు. అయితే తనకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని, తన తరువాత పార్టీలో చేరిన వారిని జాతీయ కార్యవర్గంలోకి తీసుకోవడంతో ఆయన మనస్తాపానికి గురైనట్లు తెలిసింది.పార్టీలో ప్రాధాన్యం ఉండేలా బాధ్యతలు అప్పగిస్తామని గతంలో బండి సంజయ్ హామీ ఇచ్చారు. అయితే ఇప్పుడు ఆయనే పదవిలో లేకపోవడంతో చంద్రశేఖర్ ఆశలు సన్నగిల్లాయి.గతంలో చంద్రశేఖర్ టీడీపీ, టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో పనిచేశారు. 1985 నుంచి 2008 వరకు వరుసగా 5 సార్లు వికారాబాద్ ఎమ్మెల్యేగా గెలిచారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వికారాబాద్ నుంచి అసెంబ్లీకి, 2019 పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీజేపీలో చేరినా అక్కడ ఇమడలేకపోయారు. ఈ నేపథ్యంలోనే ఇక నేను ఉండలేనంటూ తాజాగా పార్టీని వీడి బయటకు వచ్చేశారు.

## ఎన్నికల్లో టెక్నాలజీ...

# నిఘా కోసం 20 యాప్ లు

హైదరాబాద్, ఆగస్టు 14, :త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) టెక్నాలజీని వాడడానికి కేంద్ర ఎలక్షన్ కమిషన్ సన్నద్ధమవుతున్నది. ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తూ ఇప్పటికే 20 రకాల మొబైల్ యాప్‌లను కమిషన్ రూపొందించింది. ఇటీవల కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఫస్ట్ టైమ్ ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్‌ను వినియోగించింది. దీనికి కొనసాగింపుగా తెలంగాణలో సైతం ఏఐ టూల్స్ సహాయంతో మరికొన్ని అంశాల్లో విస్తృతంగా వాడాలనుకుంటున్నది.అభ్యర్థులు చేసే ఖర్చు, ఓటర్లను ప్రలోభపెట్టడం వరకు అన్నింటిపైనా నిఘా కొనసాగించడం ఏఐ వినియోగం ప్రధాన లక్ష్యం. ప్రతీ నిమిషం వారి కదలికలను ఏఐ టూల్స్ విశ్లేషిస్తాయి. అభ్యర్థులు నామినేషన్లలో అందించే సమాచారాన్ని క్రోడీకరించి ఏఐ టూల్స్ ద్వారా సమగ్రమైన డేటాను రూపొందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. నిర్దిష్టంగా ఎలాంటి యాక్టివిటీస్‌కు ఏఐ టెక్నాలజీని వాడనున్నది కమిషన్ బహిర్గతం చేయలేదు.కానీ వీలైనంత బెస్ట్ రిజల్ట్స్ రాబట్టేలా రీసెర్చ్ జరుగుతున్నది. ఓటర్లకు అవగాహన కల్పించడం, సౌకర్యాలను అందుబాటులోకి తేవడం మొదలు అభ్యర్థులు మద్యం, మనీ ద్వారా ఓటర్లను ప్రభావితం చేయడాన్ని కట్టడి చేయడం, ఎన్నికలను పారదర్శకంగా, స్వేచ్ఛగా నిర్వహించడం, అవకతవకలను నివారించడం




వరకు ఈ పరిజ్ఞానాన్ని వినియోగించనున్నది.క్షేత్రస్థాయిలో పరిశీలకుల పేరుతో ఐఏఎస్ అధికారులు మొదలు ప్రభుత్వ సిబ్బంది వరకు పనిచేస్తున్నా టెక్నాలజీని సమర్థవంతంగా వాడాలని కమిషన్ భావిస్తున్నది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహా ఆధునిక పరిజ్ఞానాన్ని వాడడం కోసం ప్రత్యేకంగా ఢిల్లీలోని ద్వారక ప్రాంతంలో ఐఐఐడీఈఎం(ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమొక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్) అనే విభాగాన్ని ఎలక్షన్ కమిషన్ ప్రత్యేకంగా నెలకొల్పింది. ఎన్నికల నిర్వహణలో ఏఐ టూల్స్ వినియోగంపై ఈ విభాగం రీసెర్చ్ చేస్తోంది. దాన్ని వినియోగించడానికి ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ ఇస్తుంది. దాదాపు పన్నెండేళ్ల క్రితమే ఈ విభాగానికి అంకురార్పణ జరిగినా మొబైల్ యాప్‌ల తయారీ వరకు అది సక్సెస్‌ఫుల్‌గా నడిచిందనేది కమిషన్ భావన.కానీ ప్రస్తుత టెక్నాలజీ యుగంలో దీనికి మరింత పదును పెట్టి ఏఐ టూల్స్ వినియోగిస్తూ 'కెపాసిటీ బిల్డింగ్' యూనిట్‌గా మలచాలనుకుంటున్నది. ఈ విభాగం ఇంతకాలం నిర్వాచన్ సదన్‌లోనే పనిచేసింది. కానీ ఇకపైన స్వతంత్రంగా పనిచేయడానికి ద్వారకలో ప్రత్యేక భవనంలోకి షిఫ్ట్ అయింది. ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ జూన్‌లో ఈ విభాగాన్ని లాంఛనంగా ప్రారంభించారు.ఎన్నికల నిర్వహణ కోసం మార్గదర్శకాలను రూపొందించడం మొదలు సిబ్బంది నుంచి సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించడం, అభ్యర్థులు సమర్పించిన నామినేషన్లలో వివరాలను విశ్లేషించి నిర్దిష్ట ఫార్మాట్‌లో డేటాను నిక్షిప్తం చేయడం, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే గుర్తించడం తదితరాలన్నింటికీ దీన్ని వాడనున్నట్లు పరోక్షంగా వ్యాఖ్యానించారు.అభ్యర్థులు నామినేషన్ పత్రాల్లో పొందుపరిచే ఫోన్ నంబర్, పాన్‌కార్డు, ఆధార్ కార్డు లాంటి వివరాలను ఏఐ టూల్స్ ద్వారా కమిషన్ సమర్ధవంతంగా వాడుకోనున్నది. వాటి ఆధారంగానే అభ్యర్థుల కదలికలు, రోజువారీ ఎలక్షన్ ఖర్చు, బ్యాంకు లావాదేవీలు, సోషల్ మీడియాలో పెట్టే పోస్టులు, ఓటర్లను ప్రలోభపెట్టడానికి వాడే విధానాలు, ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు.. వీటిపై 24 గంటలూ ఏఐ టూల్స్ సాయంతో ఏర్పడే ప్రత్యేక వ్యవస్థ నిఘా వేస్తుంది. అభ్యర్థుల నుంచి అనుచరులు, కార్యకర్తలు, ఏజెంట్లకు వెళ్లే ఆదేశాలు, సోషల్ మీడియా ప్రచారం, ఓటర్లను ఆకర్షించడానికి చేసే అనైతిక చర్యలన్నింటిపైనా మూడో కంటికి తెలియకుండా ఏఐ టూల్స్ ఆధారంగా ఏర్పడే సర్వియలెన్స్ మెకానిజం ఎప్పటికప్పుడు క్రోడీకరిస్తుంది.ఎన్నికల్లో విస్తృతంగా మద్యం, మనీ వినియోగం జరుగుతున్నా నియంత్రించడంలో కమిషన్ విఫలమవుతున్నదనే నిందలు వస్తున్నాయి. దీనికి చెక్ పెట్టడానికి కమిషన్ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఏఐ టూల్స్‌ను విస్తృతంగా వినియోగించి కట్టడి చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప స్థాయిలో వాడిన ఏఐ టెక్నాలజీ ఇచ్చిన ఫలితాలను కమిషన్ ఇప్పటికే అనలైజ్ చేసింది. తెలంగాణ నుంచి వెళ్లిన ఆరుగురు ఎన్నికల అధికారులు సైతం సమర్థవంతంగా జరిగిన ఎలక్షన్ మేనేజ్‌మెంట్‌పై అధ్యయనం చేశారు. అక్కడి బెస్ట్ ప్రాక్టీసుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇకపైన ఐఐఐడీఈఎం నుంచి వచ్చే సూచనలకు అనుగుణంగా ఏఐ టూల్స్ వినియోగం జరగనున్నది.

# బీసీలకు అన్ని రంగాల్లో సమాన వాటా ఇవ్వాలి

ఆసిఫాబాద్ జిల్లా ఆగస్టు 14 (ప్రజాపాలన,ప్రతినిధి) : జనాభా ధమాషా ప్రకారం బీసీలకు రాజకీయ ఆర్థిక సామాజిక రంగాలలో వాటా తప్పనిసరిగా ఇవ్వాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్ అన్నారు. సోమవారం మండలంలోని ఎల్లారం గ్రామాన్ని బిసి సంఘం నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీలపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని, బీసీలలోని కేవలం కొన్ని కులాలకు మాత్రమే రూ1 లక్ష పథకం ఇవ్వడం ఏంటని, బీసీలు అంటే బిచ్చగాళ్ళు కాదన్నారు.బీసీలకు వెంటనే రూ 10 లక్షల బీసీ బంధు ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీల ఓట్లతో గెలిచిన ప్రభుత్వాలు



బీసీలను లెక్కచేయకుండా వ్యవహరిస్తున్నారని ఇక సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ కుమార్, రైతు సంఘం అధ్యక్షుడు మారుతి పటేల్, మండల అధ్యక్షుడు సిరికొండసాయి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 25,26,27,తేదీలలో రాష్ట్ర శిక్షణ తరగతులు

### డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్



ఆసిఫాబాద్ జిల్లా ఆగస్టు 14 (ప్రజాపాలన,ప్రతినిధి) : ఈనెల 25,26,27,తేదీలలో హన్మకొండ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు జరగనున్నాయని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిశెల కార్తీక్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రం లోని డివైఎఫ్ఐ కార్యాలయంలో శిక్షణకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ యువ జనోద్యమాల సారధి డివైఎఫ్ఐ రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు హనుమకొండలో జరగనున్నాయని అన్నారు. స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని, నాటి పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తుందని, డివైఎఫ్ఐ 1980లో పంజాబ్ లోని లుధియానాలో నవంబర్ 1,2,3, తేదీలలో జరిగిన మొదటి మహాసభల్లో డివైఎఫ్ఐ ఏర్పడిందని, నాటి నుండి నేటి వరకు అనేక పోరాటాలు నిర్వహించి 1కోటి 50 లక్షల సభ్యత్వంతో దేశంలోనే అతిపెద్ద యువజన సంఘంగా ఎదిగిందన్నారు. ఈ సమావేశాలకు రాష్ట్రవ్యాప్తంగా 500 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని, ఈ సమావేశానికి అన్ని విధాలుగా సహకరించి,జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు రాజ్ కుమార్,సతీష్,పురుషోత్తం, నిఖిల్,లు పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న అన్ని రకాల ఏఎన్ఎం లను రెగ్యులర్ చేయాలి



ప్రజా పాలన ప్రతినిధి: రెండవ ఏఎన్ఎం లను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ తహసిల్దార్ కి వైద్య ఆరోగ్యశాఖ అధికారి దామోదర్ కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేవెళ్ల పి హెచ్ సి పరిధిలో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలువారి సమస్యలపై చేవెళ్ల తహసిల్దార్ కి వైద్య ఆరోగ్యశాఖ అధికారి దామోదర్ కి వినతి పత్రం సమర్పించడం జరిగిందని అన్నారు. 16 సంవత్సరాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండవ ఏఎన్ఎం లను నియమించింది కానీ రెగ్యులరైజ్ చేయకపోవడం వలన చాలా సమస్యలు ఎదుర్కొంటున్నామని అన్నారు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విడిపోయిన రెండు రాష్ట్రాలలో రెండవ ఏఎన్ఎంలు ఉన్నరు ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండవ ANMలను రెగ్యులరైజ్ చేసిందని కానీ తెలంగాణ ప్రభుత్వం నేటికీ రెగ్యులరైజ్ చేయలేదని అన్నారు. పైగా తెలంగాణ ప్రభుత్వం కొత్తవారిని నియమించేందుకు నోటిఫికేషన్ జారీ చేయడం దారుణమని అన్నారు. వెంటనే అట్టి నోటిఫికేషన్ రద్దు చేసి ANMలను రెగ్యులర్ చేయాలని అన్నారు.. అదేవిధంగా పని ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేశారు.. ఇట్టి విషయాన్ని తహసిల్దార్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం రెగ్యులర్ చేయకపోతే ఈనెల 16 (రేపటి) నుండి సమ్మెలోకి వెళ్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పాల్గొన్నారు..


## ఎస్ఎస్సి లో విద్యార్థులకు కీ.శే. వేమూరి.నాగమణి మెమోరియల్ ఆర్థిక సాయం

మధిర ఆగస్టు 14 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో మడిపల్లి గ్రామంలోజడ్పిహెచ్ఎస్ మడుపల్లి లో హెచ్ఎం కె .పద్మావతి



ఆధ్వర్యంలోజరిగిన కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ మడుపల్లిలో ఎస్ఎస్సి 10/10 సాధించిన విద్యార్థులు కె.వైష్ణవి,సిహెచ్. పావని, ఎస్.కౌశిక్ రెడ్డిలను ఘనంగా సన్మానించి ఒక్కొక్కరికి నాలుగు వేల రూపాయలు చొప్పున కీ.శే. వేమూరి.నాగమణి జ్ఞాపకార్థం ఆమె భర్త శ్రీ వేమూరి. సునీల్ కుమార్ నగదు బహుమతులను అందజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసినటిడిపిమండల కార్యదర్శి శ్రీ చెరుకూరి.కృష్ణారావు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి ఉత్తమ పౌరులకు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.కె. నాగూర్ వలి,టి.నరసింహారావు, వి.వెంకటేశ్వరరావు, బి.కోటేశ్వరరావు, కె.బాబురావు, పి.కిషోర్, ఎస్.రామిరెడ్డి, జె.యెహోషువ, టీ.జ్యోతిర్మయి, బి.రాణి,బి.చైతన్య,సిహెచ్.చిట్టిబాబు పాల్గొన్నారు. వేమూరి.సునీల్ కుమార్,కృష్ణారావు ఆధ్వర్యంలో హెచ్ఎం. పద్మావతిని ఘనంగా సన్మానించారు మరియు విద్యార్థులకు స్వీట్స్ పంచారు ఈ కార్యక్రమంలో ప్రజలు విద్యార్థులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో పలు వార్డులలో శంకుస్థాపన



ఆగస్టు 14 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డుల్లో శంకుస్థాపన చేసిన జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు ఈ కార్యక్రమాని ముఖ్యఅతిథిగా పాల్గొనిసీసీ రోడ్డు శంకుస్థాపన చేసిన జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు పాల్గొని పట్టణ పరిధిలో 19,20 వ వార్డులలో సీసీ రోడ్డు లకు మున్సిపల్ చైర్మన్ మొండితోక లత , కౌన్సిలర్స్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం లోని అన్ని రంగాల్లో పట్టణాల్లో పల్లెల్లో అభివృద్ధి దూసుకొని వెళుతుందని దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో అన్ని సంక్షేమ ప్రజలకు అందుతున్నాయని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు హాజరైనారు.

## జనసేన పార్టీ ఆధ్వర్యంలో తాసిల్దార్‌కు వినతి పత్రం



మధిర ఆగస్టు 14 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ కు వినతిపత్రం అందజేశారుగృహలక్ష్మి పథకం రేషన్ కార్డు లేని వారు కూడా వర్తింపుచేయాలని తక్షణం రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల జాగ లేని వారికి ఇళ్ల జాగా ఇచ్చి గృహలక్ష్మి పథకము వర్తింపచేయాలిలిలిజనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ నేమూరి శంకర గౌడ్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ శ్రీ రాము తాళ్లూరి ఆదేశాలు మేరకుఈ సందర్భంగా జనసేన పార్టీ మధిర నియోజకవర్గం నాయకులు లిశ్రీ శివరామకృష్ణ, తాళ్లూరి డేవిడ్ మాట్లాడుతూలి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏదైతే గృహ లక్ష్మీ పథకం ప్రవేశపెట్టిందో ఆ గృహలక్ష్మి పథకం రేషన్ కార్డు ఉన్న వారికే గృహలక్ష్మి పథకం వర్తింపజేసిద్దని అధికారులు చెప్తా ఉన్నారు అదేవిధంగా ఇళ్ల స్థలాలు లేని వారికి కూడా గృహ లక్ష్మీ పథకం వర్తింపచేయదని అధికారులు చెప్తా ఉన్నారు ఈ సమస్య గత సంవత్సరం క్రితం లిజనసేన పార్టీ అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ లి గుర్తించి రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని ఆ దేశాలు మేరకు తెలంగాణ జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది తక్షణం రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఈ తెలంగాణ రాష్ట్రంలో ఆరు లక్షల పై చీలుకు అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అందించాలని మధిర నియోజకవర్గంలో గత సంవత్సరం క్రితం అధికారుల అధికారుల దృష్టికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగింది కానీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు అని జనసేన పార్టీ ఎప్పుడు ప్రజా సమస్యల మీద పోరాడుతూ ఉండిద్దని ప్రజల పక్ష నిలబడిందని అర్హులైన వారందరికీ గృహ లక్ష్మీ పథకం వర్తింపచేయాలని ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని జనసేన పార్టీ ను డిమాండ్ చేస్తా ఉన్నాం స్థానిక ఎమ్మెల్యే బట్టి విక్రమార్క జడ్పీ చైర్ పర్సన్ లింగాల కమల్ రాజు ప్రజలుతో ఓట్లు ఎపిచ్చుకోవటం కాదు ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది ప్రజల సమస్యలు పట్టించుకోవాలని జనసేన పార్టీ వారిద్దరిని అడుగుతా ఉంది లేనిపక్షంలో ప్రజా సమస్యల మీద ప్రజల పక్షాన నిలబడి పోరాడుతామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా నాయకులు పుల్లారావు పగడాల పవన్ రవితేజ రవి సాయి అనిల్ పాల్గొన్నారు

## దళితులపై దాడి అమానుషం: హెచ్ ఆర్ మోహన్



మేడిపల్లి, ఆగస్టు 14 (ప్రజాపాలన ప్రతినిధి): దళితులపై దాడికి పాల్పడటం అమానుషమని ఉప్పల్ ఎస్సీ సెల్ చైర్మన్ హెచ్ ఆర్ మోహన్ పేర్కొన్నారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఉప్పల్ ఎస్సీ సెల్ చైర్మన్ హెచ్ఆర్ మోహన్ మాట్లాడుతూ గడిచిన 15 రోజుల క్రితం దళితులపై జరిగినటువంటి అమానుషమైన భౌతిక దాడి పై ఉప్పల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందని,అయినప్పటికీ ఇంతవరకు దాడికి పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. అయితే 15 రోజులుగా పోలీసు వ్యవస్థ పై ఉన్న నమ్మకంతో మేము ఎలాంటి ధర్నాలు కానీ నిరసనలు గాని చేపట్టలేదని,ఈ యొక్క దాడి దళితులపై కాదు దళిత ఆత్మగౌరవంపై ఆత్మ అభిమానం పై జరిగిన దాడిగా మేము పరిగణిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం దళితులపై చూపిస్తున్నటువంటి పక్షపాత ధోరణి పోలీసు వ్యవస్థ పై ప్రభావితం చేస్తూ దళితులపై చిన్న చూపు చూస్తూ పురుగుల కంటే హీనంగా చూస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో 2014 సంవత్సరం తర్వాత దళితులపై దాడులు, అఘాయిత్యాలు, హత్యాచారాలు పెరిగిపోయాయి దీనికి కారణం ప్రభుత్వ వైఖరే కారణమని తెలిపారు. ఉప్పల్ దళితులపై జరిగిన దాడిపట్ల ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని అన్నారు. ఈ దాడి పట్ల దళిత సంఘాలు కూడా స్పందించి వారు మాతో కలిసి పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కాబట్టి పోలీసులు దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని వెంటనే వారిని అరెస్టు చేసి దళిత జాతి ఆత్మగౌరవాన్ని కాపాడి బాధ్యుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొడిదేటి నరేష్ ,గోల్లూరి ప్రభాకర్, రాకేష్, అనిల్, ప్రేమ్, ఆరిఫ్, బాలు ప్రసాద్, నాగరాజు, అరుణ్, వినీత్, రాజ్ కుమార్, శశి, దీపు, శ్రీకాంత్, స్వామి, సాయి, సురేష్, అఖిల్, విక్కీ బాబు జానీ తదితరులు పాల్గొన్నారు.

## మాటూర్ మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతి పంపిణీ



మధిర రూరల్ ఆగస్టు 14 ప్రజాపాలన ప్రతినిధి మండల పరిధిలో మాటూర్ ఉన్నత పాఠశాలలో గత ఏప్రిల్ లో పదవ తరగతి పూర్తి చేసుకున్న మెరిట్ విద్యార్థులకు దాతలు శ్రీ గడ్డమణుగు సత్యనారాయణ రావు, గడ్డమణుగు వెంకటరమణారావులు వారి తల్లితండ్రులు గడ్డమణుగు నరసింహారావు, కమలమ్మల జ్ఞాపకార్థం ఎంపీడీఓ సిలార్ సాహెబ్, ఎమ్ఇఓ వై ప్రభాకర్, రిటైర్డ్ ఎంపీడీఓ మాధవరపు నాగేశ్వరావుల చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ దీవి సాయి కృష్ణమాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీవో సిలార్ సాహెబ్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలంటే పాఠశాల విద్య కీలకం అని పేర్కొంటూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులే అన్ని రంగాల్లో రాణిస్తారని, చక్కని ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎటువంటి ఒత్తిడి లేని చదువు నేర్చుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం మధిర మండలంలోని వివిధ పాఠశాలకు కావలసిన భౌతిక వనరులను సమకూరుస్తూ, చక్కని కార్యక్రమాలు నిర్వహిస్తున్న రిటైర్డ్ ఎంపీడీవో శ్రీ మాధవరపు నాగేశ్వరావు మాట్లాడుతూ మండలంలోని మాటూరు గ్రామానికి ఒక ప్రత్యేకత ఉందని, అటువంటి గ్రామంలో చదివే విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తూ తల్లి తండ్రులకు,గ్రామస్థులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం పాఠశాల విద్యార్థుల త్రాగునీటి అవసరం కోసం మోటార్ మరియు పైప్ లైన్ నిమిత్తం ఏడువేల ఐదువందల అరవై తొమ్మిది రూపాయల నగదును పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేయడం జరిగింది. మెరిట్ విద్యార్థులకు సాయి వినయ్, సిద్దార్థ, భవ్యశ్రీ, ఉపేంద్ర లకు నగదు బహుమతులు అందించడం జరిగింది. అనంతరం దాతల సహకారంతో పాఠశాల విద్యార్థులకు గ్రామస్తులకు స్వీట్ ప్యాకెట్లు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి సంఘ అధ్యక్షులు శ్రీ మాధవరపు అశోక్, టెక్నికల్ అసిస్టెంట్ అనిల్, విలేజ్ సెక్రటరీ కృష్ణారెడ్డి,పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గృహలక్ష్మి దరఖాస్తు దారుల ఇళ్లకు వెళ్లి విచారణ నిర్వహించాలి: తహసిల్దార్ పున్నం చందర్




బోనకల్, ఆగస్టు 14 ప్రజా పాలన ప్రతినిధి: గృహలక్ష్మి దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి విచారణ నిర్వహించాలని తాసిల్దార్ పన్నం చందర్ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు త్వరితగతిన ఎటువంటి పొరపాటులు లేకుండా గృహలక్ష్మి దరఖాస్తులను విచారణ నిర్వహించాలని తెలియజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల కార్యదర్శిల, టీం సభ్యుల ప్రత్యేక శిక్షణ సోమవారం నిర్వహించారు. ప్రతి గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రతి దరఖాస్తును సమగ్రంగా విచారణ నిర్వహించాలని ఆదేశించారు. సోమవారం నుంచి విచారణ నిర్వహించాలని ఆదేశించారు. త్వరగతిన విచారణ పూర్తి చేసి విచారణ నివేదికలను వెంటనే అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో బయ్యారపు అశోక్,ఎంపీ ఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి ,ఐకెపి ఏపీఎం యద్దనపూడి పద్మలత, గిర్దావర్లు గుగులోతు లక్ష్మణ్, జి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పశుమిత్రులను గుర్తించి, వేతనాలు అమలు చేయాలి

### సిఐటియు జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ జెడి సురేష్ కుమార్ కు వినతి పత్రం



ఆసిఫాబాద్ జిల్లా ఆగస్టు14 (ప్రజాపాలన,ప్రతినిధి) : మూగ జీవులకు వైద్య సేవలు అందిస్తున్న పశు మిత్రులను ప్రభుత్వం గుర్తించి, వేతనాలు నిర్ణయించి ఇవ్వాలని, సిఐటియు జిల్లా అధ్యక్షుడు అల్లూరు లోకేష్ డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో జెడి సురేష్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ మాట్లాడుతూ పశువు మిత్రులను ప్రభుత్వం గుర్తించాలని, మూగజీవులకు వైద్య సేవలు అందిస్తున్న పశు మిత్రులకు వేతనాలు నిర్వహించి ఇవ్వాలని, అదేవిధంగా యూనిఫాం, గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం, కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. పశువులకు అనేక రకాలైన వ్యాధులు సోకినప్పుడు వైద్య చికిత్స చేసే సందర్భంలో పశువులకు వచ్చిన వైరస్ వైద్యం అందిస్తున్న పశు మితులకు కూడా తోకుతుందన్నారు. దీనివల్ల అనేకమంది అనారోగ్యబారిన పడుతున్నారని అన్నారు. ఇలాంటి సందర్భంలో పశుమిత్రులకు ఆరోగ్య భద్రత లేకుండా పోతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలన్నారు. జెడి సురేష్ కుమార్ స్పందిస్తూ పశు మిత్రుల డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లడానికి కృషి చేస్తానని, అన్నారు. ఈ కార్యక్రమంలో పశు మిత్రులు, వసుంధర, మారుబాయి,



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

## సంపాదకీయం

మంగళవారం 15, ఆగష్టు 2023

# తెలంగాణ సంక్షేమ స్వర్ణయుగం..

విద్యార్థి దశ నుంచి సామాన్యుడిగా వచ్చి రాజకీయాల్లో అనన్య సామాన్యమైన విజయాలను తన ఖాతాలో వేసుకున్న గొప్ప నాయకుడు, రాజనీతిజ్ఞుడు ముఖ్యమంత్రి కేసీఆర్. ప్రజల నాడి పట్టుకోవడంలో కేసీఆర్‌కు సాటి మరెవరూ లేరంటే అతిశయోక్తి కాదు. తెలంగాణ రాష్ట్ర సాధన కలను సాకారం చేసి దేశం దృష్టి తెలంగాణపై పడేలా చేసిన కేసీఆర్ అపరచాణక్యుడిలా ఉద్యమాన్ని నడిపి తెలంగాణను సాధించారు. దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచేపోయే నాయకుడు కేసీఆర్.రైతులు పంట పెట్టుబడి కోసం ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధుతో రైతుల్లో భరోసా పెరిగింది. పెట్టుబడి నష్టమనే భావన లేకుండా రైతులు ధైర్యంగా వ్యవసాయం చేస్తున్నారు. దీనికి తోడు కాళేశ్వరం ప్రాజెక్టు, 24 గంటల ఉచిత విద్యుత్తు, సకాలంలో ఎరువులు, విత్తనాల సరఫరా వంటి కార్యక్రమాలతో రైతుల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది. తద్వారా ధాన్యం ఉత్పత్తిలో దేశంలో 15వ స్థానంలో ఉన్న రాష్ట్రం నేడు రెండో స్థానానికి చేరింది. అనేక సవాళ్ళు, అవరోధాల మధ్య ప్రారంభమైన తెలంగాణ ప్రగతి ప్రస్థా నం నేడు పరుగులు తీస్తున్నది. అనేక సంక్షేమ పథకాల్ని అమలు చేస్తూ బంగారు తెలంగాణ దిశగా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారు సీఎం కేసీఆర్. నీటి కష్టాల్ని తొలగించేందుకు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి అద్భుతమైన పథకాలను ప్రారంభించారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా, పారిశ్రామికంగా ముందు వరుసలో నిలిపేందుకు కేసీఆర్ నిరంతరం శ్రమిస్తున్నారు. తెలంగాణ కోటి ఎకరాల మాగాణం కావాలనే లక్ష్యంతో కాళేశ్వరం ప్రాజెక్టుకు పథక రచన చేశారు. అన్నదాతల కోసం రైతుబంధును అమలు చేస్తున్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండటం కోసం నిరంతరం శ్రామికుడిలా పనిచేస్తున్నారు కేసీఆర్. ప్రతిరంగంలోనూ యావద్దేశం నివ్వెరపోయే ఫలితాలను సాధిస్తూ ప్రగతిపథంలో పరుగులు పెడుతున్న తెలంగాణ దేశంలోనే అత్యంత బలీయమైన ఆర్థికశక్తిగా ఎదగడం ఒక చరిత్రాత్మక విజయం.అభివృద్ధిని సాధించడమేకాదు, అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించడంలో కూడా మనరాష్ట్రం నూతన ఒరవడిని సృష్టించింది. పరిపాలనా వ్యవస్థ ప్రజలకు చేరువైంది. పాలన పారదర్శకంగా ఉండేందుకు రాష్ట్ర అవతరణ అనంత రం 10 జిల్లాలుగా ఉన్న తెలంగాణను 33 జిల్లాలుగా విభజించుకున్నాం. ఆ ఫలితం ఈరోజు ప్రజల మధ్యలో ఉన్నది. ప్రజలకు దూరాభారం తగ్గి అందుబాటులోకి వచ్చింది. అధికారుల్లో, ప్రజా ప్రతినిధుల్లో జవాబుదారీతనం పెరిగింది.ఆదివాసీ, గిరిజనుల చిరకాల ఆకాంక్షను తెలంగాణ ప్రభుత్వం పోడు సమస్యను పరిష్కరించడం ద్వారా తీర్చింది. గిరిజనులకు భూములపై హక్కులు కల్పించింది. అటవీ భూములపై ఆధారపడిన ఒక లక్షా యాభైవేల మంది ఆదివాసీ, గిరిజనులకు నాలుగు లక్షల ఎకరాల పోడు భూములపై యాజమాన్య హక్కులు కల్పించింది. వారికి కూడా రైతుబంధు పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నది. దీనితో ఆదివాసీలు ఎలాంటి ఆటంకం లేకుండా వ్యవసాయం చేసుకుంటున్నారు.దళితులు స్వశక్తితో, స్వావలంబనతో జీవించాలన్న ఆశయంతో 'దళితబంధు' పేరుతో విప్లవాత్మక పథకాన్ని అమలు చేస్తున్నది తెలంగాణ ప్రభుత్వం. చరిత్రలో మునుపెన్నడూ లేని విధం గా రాష్ట్రంలోని ప్రతి దళిత కుటుంబానికి రూ.10 లక్షల మొత్తాన్ని నూరుశాతం గ్రాంట్‌గా అందించి ఆత్మగౌరవంతో జీవించడానికి ప్రభుత్వం అండ గా నిలుస్తున్నది.తెలంగాణ భూ భౌతిక పరిస్థితికి అనుగుణంగా కాకతీయ రాజులు నిర్మించిన గొలుసుకట్టు చెరువుల సాగునీటి వ్యవస్థ తెలంగాణకు ప్రాణప్రదమైనది. చెరువులకు నవజీవం తెచ్చే పథకానికి కాకతీయుల స్మరణలో మిషన్ కాకతీయగా నామకరణం చేసి నీటి వనరులకు విజయవంతంగా మరమ్మత్తులు చేశారు. రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వం వైద్యసేవల ప్రమాణాలను పెంచింది. నేడు స్వపరిపాలనలో ఆరోగ్య రంగం ప్రజలకు అత్యంత చేరువయింది. ప్రజలకు ఆరోగ్యాన్ని అందించడంలో నేడు తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. రైతులు పంట పెట్టుబడి కోసం ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధుతో రైతుల్లో భరోసా పెరిగింది. పెట్టుబడి నష్టమనే భావన లేకుండా రైతు లు ధైర్యంగా వ్యవసాయం చేస్తున్నారు. దీనికి తోడు కాళేశ్వరం ప్రాజెక్టు, 24 గంటల ఉచిత విద్యుత్తు, సకాలంలో ఎరువులు, విత్తనాల సరఫరా వంటి కార్యక్రమాలతో రైతుల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది. తద్వారా ధాన్యం ఉత్పత్తిలో దేశంలో 15వ స్థానంలో ఉన్న రాష్ట్రం నేడు రెండో స్థానానికి చేరింది.తెలంగాణ వస్తే రాష్ట్రం అంధకారమవుతుందని సమైక్య పాలకులు ఎద్దేవా చేశారు. వారి అంచనాలను తలకిందులు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం విద్యుత్తు రంగంలో విప్లవాత్మక విజయాలు సాధించింది. నేడు అన్ని రంగాలకు నిరంతరాయంగా 24 గంటల పాటు, వ్యవసాయానికి ఉచితంగా విద్యుత్తు సరఫరా చేసే ఏకైక రాష్ట్రంగా తెలంగాణ కీర్తి దేశం నలుదిశలా వ్యాపించింది.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సంపూర్ణ పరివర్తనను సాధించేందుకు చేపట్టిన పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలు గ్రామాలు, పట్టణాల రూపురేఖలనే మార్చివేశాయి. అన్నివర్గాల్లో విశ్వాసాన్ని నెలకొల్పుతూ, సంక్షేమ ఫలాలను సర్వజనులకూ అందిస్తున్న ది. మైనారిటీల అభివృద్ధి కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నది. ఇమామ్‌లకు, మౌజమ్‌లకు నెలకు రూ.5 వేల చొప్పున మొత్తం 10 వేల మందికి జీవన భృతిని అందజేస్తున్నది. ప్రభుత్వమే అధికారికంగా రంజాన్, క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తూ రాష్ట్ర ప్రతిష్ఠకు ఉజ్వల సంకేతంగా నిలిచింది. నూతనం సచివాలయం, అమరవీరుల స్మారకం, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఇలా ఎన్నో అద్భుత కట్టడాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించింది. స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత నేతన్నల జీవితాలలో వెలుగులు నింపేందుకు తెలంగాణ ప్రభు త్వం అనేక సంక్షేమ, సహాయ కార్యక్రమాలను చేపట్టింది. నిరుపేదల కోసం డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి ఇస్తున్నది. సొంతస్థలం ఉన్నవారికి గృహలక్ష్మి పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి చేయూతను ఇస్తున్నది.వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, పైలేరియా బాధితులు, డయాలసిస్ రోగులకు పింఛను అందజేసి ఆదుకుంటున్నది. ఏండ్ల తరబడి నిర్లక్ష్యంగా నిలిచిపోయిన ప్రాజెక్టులను సత్వరం పూర్తిచేయడంతో నేడు పచ్చని చేలతో రాష్ట్రం కళకళ లాడుతున్నది. రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి, వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మరో రూ.19 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసింది. అన్ని వర్గాలకు మంచి జరగా లన్నదే సీఎం కేసీఆర్ సంకల్పం. అందుకే తెలంగాణ ప్రభుత్వం ఏ పథకాన్ని ప్రవేశపెట్టినా దానివెనుక ఉండేది మానవీయ కోణమే. తెలంగాణ అభివృద్ధి మాడల్‌తో ఇప్పుడు దేశ్ కీ నేతగా బీఆర్ఎస్ ప్రస్థానం మొదలు పెట్టారు ముఖ్యమంత్రి కేసీఆర్.

# భారత దేశ స్వాతంత్ర్యానికి 76 ఏళ్ళు

**స్వతంత్ర భారతం 75 ఏళ్లు పూర్తి చేసుకుని 76వ ఏట అడుగు పెడుతోంది**

**మణిపూర్ లో మంటలు, మానవ మృగాల చేతిలో బలైపోతున్న మహిళలు**

**అజ్ఞానపు ఆధిపత్యం , పాలకుల అసమర్థత సిగ్గుతో తల వంచుకుంటున్న మానవత్వం**

**స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు చెసుకుందామా, అర్థం లేని ఆధిపత్యానికి గులాం గిరీ చేద్దామా**

**(అర్థ శతాబ్దపు అజ్ఞానాన్ని స్వతంత్రమందామా..! సర్వోత్సవాలు చేద్దామా ..? ఆత్మ వినాశపు అరాచకాన్ని స్వరాజ్య మందామా..! దానికి సలాము చేద్దామా..? నిత్యం కొట్టుకు చచ్చే జనాల్ది స్వేచ్ఛనుకుందామా..? దాన్ని స్వతంత్రం అందామా..! అంటూ సీని కవి సిరివెన్నెల ప్రశ్నించాడు. పాలకుల అసమర్థత, అధికారుల ధన దాహం వెరసి పరిష్కారం అయ్యే సమస్యలు జటిలం చేసి పాలకులు ఓట్ల రాజకీయం చేస్తుంటే స్వతంత్ర భారతానవకి సిగ్గుతో తలవంచుకుంటుంది. ఒక దిక్కు టెక్నాలజీ విస్తరించుకుంటూ ప్రపంచ దేశాల్లో మన ఉనికిని కాపాడుకుంటూ విజయాలు సాధిస్తుంటే ..!మణిపూర్ మహిళ లను నగ్నంగా ఊరేగించి ,ఆపై అత్యాచారం చేసి పైశాచిక ఆనందంతో కూడిన విజయాన్ని పొందుతున్నారు. ఈ 76 ఏళ్ల స్వతంత్ర భారత వేడుకలు జరుపుకుంటున్న నేపథ్యంలో సగటు భారతీయుడు సంబర పడాలా..? కులాల కోసం గుంపులు కడుతూ జనాలను పోగేసుకుని మతాల చిచ్చులు రేపు తుంటే ... యువత ఆవేశాలకు లోనై విశక్షణ కోల్పోయి సాటి మనిషిని చంపుకుంటూ మృగంలా మారిపోతున్నాడు. ఈ చిగ్గు లేని సమాజాన్ని సృష్టించిన వాడిని నిగ్గదీసి అడిగే ధైర్యం చేసేది ఎవరు. )**

"ప్రపంచం అంతా నిద్రిస్తున్న వేళ .. అర్థరాత్రి భారత్ కొత్త జీవితం, స్వేచ్ఛల కోసం మేలుకుంది..! " అని 76 ఏళ్ల క్రితం భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన క్షణాన జవహర్‌లాల్ నెహ్రూ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆ మాటల వెనుక ఎంతో అర్థం ఉంది. స్వాతంత్రం వస్తేనే సమస్యలు పరిష్కారం కావు. అప్పట్నుంచే అసలు సమరం ప్రారంభమవుతుంది. దేశానికి ప్రజలందరూ కలిసి ఓ దశ.. దిశ తీసుకు రావాల్సిన అవసరం అప్పుడు ఉంది. అప్పట్నుంచి ఇప్పటికి 75ఏళ్లు పూర్తయ్యాయి. 76వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఇన్నేళ్ల కాలంలో భారత్ ఏం సాధించింది..? ప్రపంచంతో పోటీ పడి ఎంత ముందుకెళ్లాం..?



**వెనక్కి తిరిగి చూసుకుంటే గర్వపడే విజయాలు.!**

రెండు శతాబ్దాల బానిసత్వం.. త్యాగధనుల పోరు ఫలితం.. స్వేచ్ఛా గీతికతో మువ్వన్నెల స్వాతంత్ర్య భారతం. రెండు వందల సంవత్సరాలు భారత్‌ను తమ కబంధ హస్తాల్లో బిగించిన ఆంగ్ల పాలకుల్ని తరిమేయడానికి చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రతి పౌరుడూ ఓ యోధుడయ్యాడు. స్వాతంత్ర్య సంగ్రామంలో సామాన్యుడు సైతం దేశం కోసం సర్వం త్యాగం చేశాడు. జెండా పట్టుకుని భరతమాత దాస్య శృంఖలాలు తెంచేందుకు వజ్రాయుధమే అయ్యాడు. అలా అందరి రక్తం, కష్టం, త్యాగం సమ్మిళితంగా మన చేతికందిన స్వాతంత్ర్యానికి 76వ ఏడు వచ్చింది. 75ఏళ్ల కిందటి ప్రజల జీవన ప్రమాణాలతో పోలిస్తే ఇప్పుడు దేశం ఎంతో పురోగమించింది. ఓ పాతికేళ్ల ఏళ్ల క్రితం వరకూ సగం జనాభాకు కరెంట్ అంటే తెలియదు. ఇంటర్నెట్ అనే పదం కూడా తెలియదు. ఇక రోడ్లు , మంచినీరు , గ్యాస్ వంటి సౌకర్యాల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. అలాంటి పరిస్థితుల్ని ... ప్రస్తుత అధిగమించాం. ఇక విద్య, వైద్య సౌకర్యాలు ఎంతో మెరుగుపడ్డాయి. అందరికీ సరిపడా అందుతున్నాయా అంటే.. సంతృప్తికరం అని చెప్పలేం కానీ.., నిన్నటి కంటే ఈ రోజు మెరుగు అని మాత్రం చెప్పగలిగే స్థితిలో భారత్ ఉంది.

**ఇప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశమే. .!**

స్వాతంత్ర్యం వచ్చిన 76ఏళ్లకు కూడా భారత్‌ను అభివృద్ధి చెందుతున్న దేశంగానే చెబుతున్నారు. దేశ జనాభాలో ఇప్పటికీ సగం మందికిపైగా పేదరికంలోనే ఉన్నారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా పేరొందిన భారత్‌లో ఇంతమంది పేదలు ఉండటం ఖచ్చితంగా వైఫల్యమే. ధనవంతులు మరింత ధనవంతులవుతున్నారు. కానీ పేదలు మాత్రం పైకి రావడం లేదు. పేదరికం తగ్గిపోయిందని ప్రభుత్వం లెక్కలు చెబుతూ ఉండవచ్చు. కానీ ప్రభుత్వం నిర్దేశించుకున్న మొత్తం కన్నా ఒక్క పైసా సంపాదించుకున్నా వాళ్లు పేదలు కాదనడం... మనల్ని మనం మోసం చేసుకోవడమే. దేశంలో విద్య, వైద్యం అందని వారంతా పేదలుగానే భావించాల్సి ఉంటుంది. కేవలం రేషన్ కార్డు ఉన్న వారే పేదవాళ్లు.. మిగతా వాళ్లెవరూ కాదనడం ఎంత మూర?త్వమో.. ప్రభుత్వాలు కూడా అర్థం చేసుకున్న రోజునే నిజమైన పేదరిక నిర్మూలనకు బీజాలు పడతాయి.

**మణిపూర్ లో మంటలు మానవత్వం తలదించుకుంది.**

శతాబ్దానికి మూడు వంతులు గడిచిపోయింది. టెక్నికల్‌గా మనం ఎక్కడకో పోయాం. చంద్రుడ్ని అదుకుంటున్నాం. ఆకాశానికి నిచ్చెనలేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా భారతీయులు వైద్య రంగంలో సంచలనాలు సృష్టిస్తున్నారు. టెక్నాలజీ రంగంలో భారతీయులే గ్రేట్ అన్న పేరు తెచ్చుకుం టున్నారు. కానీ.. అదే సమయంలో కాస్త వెనక్కి తిరిగి చూస్తే .. మణిపూర్ లో మంటలు రేగుతున్నాయి. మానవత్వం తలదించుకుంది. ఆధిపత్య కులాల పోరుతో మహిళలను నగ్నంగా ఊరేగిస్తూ సామూహిక మానభంగాలు చేస్తూన్నారు. సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న వర్గాలు సైతం తమకూ రిజర్వేషన్లు కావాలని డిమాండు చేస్తున్న పరిస్థితి నెలకొంది.

**ప్రజాస్వామ్యం బలంగా ఉండాలంటే... వ్యవస్థలన్నీ సక్రమంగా పని చేయాలి.**

భారతదేశం ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం. అయితే ఆ ప్రజాస్వామ్య పునాదులు ఈ 76 ఏళ్లలో బలపడ్డాయా... బలహీనపడ్డాయా అని విశ్లేషించుకుంటే.. రెండోదే నిజం అని అంగీకరించక తప్పని పరిస్థితి. ప్రజాస్వామ్యం బలంగా ఉండాలంటే... వ్యవస్థలన్నీ సక్రమంగా పని చేయాలి. కానీ దేశంలో ప్రతి వ్యవస్థ సవాళ్లను ఎదుర్కొంటూనే ఉంది. న్యాయవ్యవస్థ సహా.. రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థలు అన్నీ ఏదో ఓ సందర్భంలో సవాళ్లను ఎదుర్కొంటూనే ఉంది. దీనికి కారణం రాజకీయ వ్యవస్థే. ప్రజలు ఇచ్చిన అధికారంతో మిగతా వ్యవస్థలను అదుపు చేయాలని రాజకీయ వ్యవస్థ అంతకంతకూ భావిస్తూ పోతూండటమే సమస్యలకు మూలం అవుతోంది. అదే ప్రజాస్వామ్యానికి పెను సవాల్‌గా మారే అవకాశం కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో భారత ప్రజాస్వామ్యం ఎదుర్కొనే అతి క్లిష్టమైనసమస్య కూడా ఇదే కావొచ్చు.

**కామెర వెంకటస్వామి, సీనియర్ రిపోర్టర్**

# జ్ఞానానికి గేట్‌వే..

సమాచార సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేటి సమాజంలో గ్రంథాలయాల పాత్ర కీలకమైనది. విద్య, పరిశోధన, సంస్కృతి, సమాచార వ్యాప్తికి తోడ్పాటునివ్వడంలో గ్రంథాలయాల పాత్ర అనిర్వచనీయం. ఈ డిజిటల్ యుగంలో లైబ్రరీలు ఈ-బుక్స్, అకడమిక్ జర్నల్స్, రీసెర్చ్ పేపర్లు, మల్టీమీడియా కంటెంట్ సహా తక్షణం అందుబాటులో వుండే సమాచార భాండాగారాలు. ఇంటర్నెట్ అనుసంధానంతో భౌగోళిక సరిహద్దులను దాటి...సమాచారం పొందటానికి అవకాశం ఏర్పడింది. విద్యార్థుల నుంచి పరిశోధకుల వరకు అనంతమైన సమాచారాన్ని ఈ లైబ్రరీలు అందిస్తాయి. చదువుల నైపుణ్యాలను మెరుగుపర్చడానికి, వివిధ విషయాలపై అవగాహన పెంచడానికి...జీవితకాలం తోడుండే నేస్తం లైబ్రరీ. ప్రపంచస్థాయి నుంచి మండల స్థాయి, కళాశాల, పాఠశాల స్థాయి వరకు గ్రంథాలయాలు వున్నాయి. గ్రంథాలయాలంటే కేవలం పుస్తకాల వరుసలు కాదు, వివిధ పత్రికల సమాహారం అంతకన్నా కాదు. గ్రంథాలయం..ఆలోచనా స్రవంతి...నిశ్శబ్ద చైతన్య దీపిక. మంచి పుస్తకం కొత్త ఆలోచనలను రేకెత్తిస్తుంది. మంచి పుస్తకమిచ్చే మనశ్శాంతి అనుభవించేవారికే తెలుస్తుందంటారు. ప్రతి ఇంట్లో వంటగది వున్నట్లే పుస్తకాల గది కూడా వుండాలి. 'పుస్తకాలులేని ఇల్లు ఆత్మలేని శరీరం వంటిది' అంటారు. మహాకవి కాళిదాసు జ్ఞానాన్ని సుగంధంతో పోల్చారు. పువ్వు వలే పుస్తకం కూడా ఎలాంటి లాభాపేక్ష లేకుండా నలుదిక్కులా పరిమళాన్ని వెదజల్లుతుందని అంటారాయన. 'నేను నా లైబ్రరీలోకి వెళ్లానంటే... ప్రపంచ చరిత్ర అంతా నా కళ్ల ముందు కనిపిస్తుంది అంటారు అలెగ్జాండర్ స్మిత్. దేశ చరిత్ర, కళలు, సంస్కృతులు-పుస్తకాలు లేకుండా వర్థిల్లవు. అధ్యయనం లేకుండా ఏ రంగంలోనూ ఎవరూ రాణించలేరు. గొప్ప సంస్కృతులు గొప్ప చరిత్రగా మనగలగడానికి పుస్తకాలు, గ్రంథాలయాలు వారధులు. 'పుస్తకాలు నా మనస్సుకు, హృదయానికీ రెక్కలనిచ్చాయి/ నేను బురద నుంచి బయటపడటానికి యెంతో తోడ్పడ్డాయి/ పుస్తకాలు చదవకపోతే నా చుట్టూ వున్న మౌఢ్యంలోనూ, నీచంలోనూ మునిగిపోయి వుండేవాడ్ని!/ విశాలమైన ప్రపంచ దృశ్యాలను పుస్తకాలు నా ముందు పరిచాయి' అంటాడు మక్సీం గోర్కీ. దేశ ప్రజలను అలాంటి మౌఢ్యంలోకి, నీచంలోకి నడిపించడానికి, సమాజ వికాసానికి వారధిగా వున్న లైబ్రరీలకు గండి కొట్టడానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం పావులు కదుపుతోంది. భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసి, ఆ స్థానంలో మనుస్మృతిని తీసుకురావాలని ఆర్ఎస్ఎస్ ఒక పథకం ప్రకారం యత్నిస్తోంది. ఇప్పటికే విశ్వవిద్యాలయాలు, కేంద్ర సంస్థలు, శాస్త్ర, పరిశోధనా సంస్థలన్నిటినీ సంఘ్ పరివారంతో నింపేశారు. శాస్త్ర పరిశోధనలకు అందజేసే అవార్డులను నిలిపేశారు. డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని పాఠ్యాంశం నుంచి తొలగించారు. పాఠ్యాంశంగా వున్న గాంధీ జీవిత చరిత్రను తొలగించి, సావర్కర్ చరిత్రను జోడించారు. సంఘ్ పరివారాన్ని దేశవ్యాప్తంగా విస్తరింపజేస్తూ దళిత, ఆదివాసీ యువతపై కేంద్రీకరించి వారిలో బూజుపట్టిన మనువాద భావాలను నింపుతున్నారు. ఇవన్నీ ఒకెత్తు అయితే...తాజాగా దేశంలోని గ్రంథాలయాలను తన గుప్పిట్లోకి తెచ్చుకొనేందుకు పథకాలు రచిస్తోంది. గ్రంథాలయాల పనితీరులో జోక్యం చేసుకొని, సంఘ్‌పరివార్ భావజాలాన్ని వ్యాప్తి చేయడమే పనిగా పెట్టుకుంది. ఇదే జరిగితే... ఇప్పటివరకూ విజ్ఞానాలయాలుగా వున్న గ్రంథాలయాలు...అజ్ఞాన సమాచారంతో నిండిపోతాయి. గ్రంథాలయాలు కేవలం పుస్తక నిక్షేపాలు కాదు... అవి సమాచార వనరులు. జ్ఞాన సముపార్జన కేంద్రాలు. నూతన భావాల ఉత్పాదనకు, నూతన విజ్ఞాన సృష్టికి నిలయాలు. 'ప్రజల చైతన్యంలో మనం నాటిన విత్తనాలు మొలకెత్తకుండా ఎల్లకాలం వుండబోవు.

## కృష్ణాలో అరుదైన వజ్రం

విజయవాడ, ఆగస్టు 14, : ఓ వ్యక్తికి అరుదైన వజ్రం దొరకడంతో విషయం ఆనోటా ఈనోటా పాకడంతో చుట్టుపక్కల గ్రామాల వారు అక్కడికి వెళ్లి వజ్రాల వేట కొనసాగిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం గుడిమెట్లలో ఇది జరిగింది. అరుదైన వజ్రం దొరకడంతో భారీ సంఖ్యలో స్థానికులు అక్కడికి వెళ్లి వజ్రాల కోసం అన్వేషిస్తున్నారు. సత్తెనపల్లి సమీపంలోని బిగుబండ గ్రామానికి చెందిన ఓ కుటుంబం ఎన్టీఆర్ జిల్లా గుడిమెట్లలో వజ్రాల కోసం వేట సాగిస్తోంది. ఈ క్రమంలో ఓ వ్యక్తికి అరుదైన వజ్రం దొరికింది. వజ్రానికి 6 కోణాలు ఉండటం, ఇది షడ్ బుజి వజ్రం కావడం తో మంచి డిమాండ్ వచ్చింది. దీని విలువ అరకోటి ఉంటుందని భావిస్తున్నారు. దాదాపు రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు షడ్ బుజి వజ్రం ధర ఉంటుందని అంచనా వేస్తున్నారు. వజ్రం దొరికిందని ఆనోటా ఈనోటా పాకడంతో స్థానికుల నుంచి విషయం తెలుసుకున్న వజ్రాల వ్యాపారులు ఆ కుటుంబాన్ని సంప్రదించారు. రూ.40 లక్షలు ఇస్తామని, తమకు ఆ అరుదైన వజ్రాన్ని విక్రయించాలని బేరసారాలు జరిపారని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఆరు భుజాలు కలిగిన వజ్రానికి మరింత ధర వస్తుంది, మంచి ఆఫర్ కోసం వాళ్లు ఆశగా ఎదురుచూస్తున్నారు. గుడిమెట్లతో పాటు ఏపీలో కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో వజ్రాల కోసం నిరంతరం ఏదో చోట తవ్వుతూ ఉంటారని తెలుస్తోంది. ఓ వ్యక్తికి అరుదైన వజ్రం దొరికిందని తెలియడంతో గుడిమెట్లకు స్థానికులు క్యూ కట్టారు. లంచ్ బాక్సులతో సహా అక్కడ వాలిపోతున్నారు. కుటుంబాలు కుటుంబాలు గుడిమెట్లకు వచ్చి వజ్రాల కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు వేట కొనసాగిస్తున్నారు. గతంలో ఈ ప్రాంతం రాజుల పాలనలో ఉందని, కనుక వజ్రాలు దొరుకుతాయని స్థానికులు నమ్ముతున్నారు. రాత్రిళ్లు సైతం లైట్లు వేసుకుని మరీ భారీ గుంతలు తవ్వుతూ వజ్రాల కోసం వెతుకుతున్నారు. ఇటీవల ఒకేరోజు మూడు వజ్రాలు దొరికాయని ప్రచారం జరిగిన తరువాత గుడిమెట్లకు స్థానికులు క్యూ కడుతున్నారు. ఒక్క వజ్రం దొరికినా తమ కష్టాలు తొలగిపోతాయని వారు చెబుతున్నారు.

# టీడీపీ గూటికి యార్లగడ్డ...



విజయవాడ, ఆగస్టు 14, :గన్నవరం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో విభేదాలు తారా స్థాయికి చేరాయి. దీంతో ఆ పార్టీని వీడేందుకు యార్లగడ్డ వెంకటరావు రెడీ అయ్యారని సన్నిహితులు చెబుతున్నారు. పార్టీ వర్గాల్లో కూడా ఎప్పటి నుంచి ప్రచారం జరుగుతోంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గన్నవరం నియోజకవర్గంలో ఇప్పటికే తారా స్థాయికి విభేదాలు చేరాయి. తెలుగు దేశం పార్టీ నుంచి గెలుపొందిన వల్లభనేని వంశీ మోహన్ ఎన్నికల తరువాత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి జై కొట్టారు. జగన్ వెంట నడవాలని నిర్ణయించుకున్నారు. అప్పటి నుంచి గన్నవరం వైఎస్ఆర్‌సీపీలో రాజకీయ రగడ రాజుకుంది. వంశీ రాకను ఆయనపై పోటీ చేసి ఓడిపోయిన నేతలు వ్యతిరేకించారు. ఈ వ్యవహారం ముఖ్యమంత్రి జగన్ వద్ద కూడా పంచాయితీ నడిచింది. అయినా వివాదానికి తెర పడలేదు. అధినాయకత్వం కూడా వంశీకి వ్యతిరేకంగా గళం వినిపిస్తున్న నాయకులను లైట్ తీసుకున్నారు. అధినాయకత్వం వంశీని వెనకేసుకొస్తున్నందున ఆయన్ని వ్యతిరేకించిన యార్లగడ్డ వెంకటరావు తెలుగు దేశం పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నారని టాక్ నడుస్తోంది. నారా లోకేష్ యువ గళం పాదయాత్రలో పాల్గొన టీడీపీ కండువా కప్పుకోవాలని చూస్తున్నారట. గన్నవరం నియోజకవర్గంలోకి త్వరలోనే యువగళం పాదయాత్ర ఎంట్రీ ఇస్తుంది. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకటరావు సైకిల్ ఎక్కి గెలుపు జెండా ఎగరేయాలని చూస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గన్నవరం నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతల మధ్య విభేదాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. బహిరంగంగానే వల్లభనేని వంశీ, యార్లగడ్డ వెంకటరావు చేతులు కలిపి కలసి పని చేయాలని జగన్ నచ్చ చెప్పారు. అయినా యార్లగడ్డ వెంకటరావు, వంశీతో కలసి పని చేసేందుకు ససేమిరా అన్నారు. నియోజకవర్గంలో ఉన్న డాక్టర్ దుట్టా రామచంద్రరావుతో కలసి వంశీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. ఇవన్నీ పట్టించుకోకుండా ముఖ్యమంత్రి జగన్ వచ్చే ఎన్నికల్లో వల్లభనేని వంశీకి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరవున సీటు ఇచ్చేందుకు అంగీకరించారు. దీనిపై బహిరంగంగానే దుట్టా, యార్ల అసహనం వ్యక్తం చేశారు. అయినా ఈ ఇద్దరు నేతలను కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టించుకోలేదు. 2019ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున యార్లగడ్డ వెంకటరావు తెలుగు దేశం పార్టీ అభ్యర్థిగా ఉన్న వంశీకి వ్యతిరేకంగా పోటీ చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హవా గట్టిగానే వీచినప్పటికి తెలుగు దేశం పార్టీ తరపున వల్లభనేని వంశీనే శాసన సభ్యుడిగా గెలుపొందారు. తెలుగు దేశం తరపున వల్లభనేని వంశీ 990 ఓట్ల మెజార్టీతో, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి యార్లగడ్డ వెంకటరావుపై గెలుపొందారు. దీంతో ఇప్పుడు అదే అంశంపై యార్లగడ్డ వెంకటరావు దూకుడుగా ఉన్నారని అంటున్నారు. గన్నవరం లో వంశీకి ఎదురు గాలి ఉందని, గత ఎన్నికల్లో వంశీ కేవలం 990ఓట్ల మెజార్టీతో గెలుపొందారు కాబట్టి, ఈ సారి ఎన్నికల్లో వంశీని ఓడించటం పెద్ద కష్టం కాదని వెంకటరావు వర్గం భావిస్తున్నట్లుగా చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావటంతో పాటుగా, గుడివాడ, గన్నవరం నియోజకవర్గాలపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. దీంతో ఇప్పుడు గన్నవరం నియోజకవర్గంలో శాసన సభ్యుడు వల్లభనేని వంశీని ఓడించటమే ప్రధాన టార్గెట్‌గా ప్రతిపక్షాలు సిద్దమయ్యాయి. ఇప్పుడు యార్లగడ్డ కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగు దేశానికి చేరువ కావటంతో, రాజకీయం మరింత వేడెక్కింది. అధికార పక్షం సపోర్ట్ వంశీకే ఉన్నందున వచ్చే ఎన్నికల్లో గన్న'వరం" ఎవరికి అన్నదాని పై సర్వత్రా ఉత్కంఠత నెలకొంది

# ఏపీలో మాటల మంటలు

### వార్నింగ్ లు ఇస్తున్ననేతలు

విశాఖపట్టణం, ఆగస్టు 14, :ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు రోజురోజుకు హీటెక్కుతున్నాయి. అధికార పార్టీ వైసీపీ వర్సెస్ ప్రతిపక్ష పార్టీలు జనసేన, టీడీపీ మాటల తూటాలతో దూసుకెళ్తున్నాయి. ఒకటంటే.. రెండంటాం.. అంటూ పవన్ కల్యాణ్ టార్గెట్‌గా వైఎస్ఆర్‌సీపీ మండిపడుతోంది. రుషికొండ నిర్మాణాలతో మొదలైన రగడ కాస్త.. చినికి చినికి గాలి వానలా మారింది. ఈ క్రమంలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు మరింత ఆజ్యం పోశాయి. వాలంటీర్లను దండుపాళ్యం బ్యాచ్‌తో పోల్చిన పవన్ కల్యాణ్‌పై అధికారపార్టీ వైసీపీ కౌంటర్ ఎటాక్ చేస్తూ వస్తోంది. నిన్నటి వ్యాఖ్యల మంటలు చల్లారకముందే.. తాజాగా వైసీపీ మంత్రులు పవన్ పై మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. మినిస్టర్స్.. అంబటి రాంబాబు, రోజా, కారుమూరి తాజాగా పలు వ్యాఖ్యలు చేశారు. విశాఖ బ్రాండ్‌ను నాశనం చేసేలా పవన్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు మంత్రి రోజా. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదంటూ వార్నింగ్ ఇచ్చారు అంబటి. పవన్ ఇలాగే మాట్లాడితే ప్రజలే ఛీకొడతారన్నారు మరో మంత్రి కారుమూరి. విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అయితే.. పవన్‌పై పర్సనల్ ఎటాక్‌కి దిగారు. దీంతో ఏపీ రాజకీయాలు మరింత హీటెక్కాయి. పవన్ కల్యాణ్ పై మంత్రులు ఏమన్నారో ఒకసారి చూద్దాం..ఏపీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ.. పవన్‌కళ్యాణ్ పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చంద్రబాబు,పవన్‌కళ్యాణ్ చాలా అసహనంతో ఉన్నారు. పవన్ చంద్రబాబుతో కలిసి హింసను రెచ్చగొడుతున్నారని అన్నారు. ఇద్దరు అసహనంతో సీఎం జగన్‌పై విమర్శలు చేస్తున్నారు మండిపడ్డారు. చంద్రబాబును సీఎం చేయడమే పవన్ లక్ష్యమన్నారు. పవన్‌కళ్యాణ్ జనసేన కార్యకర్తలను నిండా ముంచుతారని హెచ్చరించారు. సీఎం జగన్‌పై పవన్ అర్థం లేని విమర్శలు చేస్తున్నారని.. ప్రాజెక్టుల పేరుతో గతంలో టీడీపీ దోపిడీకి పాల్పడిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పవన్‌కళ్యాణ్ తనకు మోసం చేశాడని స్వయంగా రేణుదేశాయ్ ఆరోపించారన్నారు అంబటి రాంబాబు. హిందూ మహిళగా ఆమె చేసిన కామెంట్లను తాను సమర్థిస్తునట్టు తెలిపారు. అయితే ఏపీ ప్రజలు పవన్‌కు ఒక్క అవకాశం కూడా ఇవ్వరని స్పష్టం చేశారు మంత్రి అంబటి రాంబాబు. విశాఖ బ్రాండ్ నాశనం చేసేలా చంద్రబాబు, పవన్ మాట్లాడుతున్నారని మంత్రి రోజా మండిపడ్డారు. రుషికొండపై నిర్మాణాలన్నీ నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయన్నారు. రుషికొండపై కొత్త భవనాలు కడితే తప్పేంటి..? నిబంధనలకులోబడే రుషికొండపై నిర్మాణాలు జరుగుతున్నాయి.. పవన్ మెంటల్ హాస్పిటల్‌లో చేరాలంటూ రోజా ఫైర్ అయ్యారు. ఎన్ని కుట్రలు చేసినా విశాఖ రాజధాని రాకుండా ఆపలేరు.. అంటూ రోజా స్పష్టంచేశారు. వాలంటీర్ల వ్యవస్థతో ప్రజలకు ప్రభుత్వం మరింత చేరువైందన్నారు మంత్రి కారుమూరి నాగేశ్వరరావు. వాలంటీర్ల వ్యవస్థను పవన్ దండుపాళ్యం బ్యాచ్‌తో పోల్చడాన్ని తీవ్రంగా ఖండించారు..పవన్ ఇలాగే మాట్లాడితే ప్రజలే ఛీకొడతారంటూ విమర్శించారు. విశాఖలో కబ్జాలు, అక్రమాలపై పవన్ కామెంట్లకు కౌంటర్ ఇచ్చారు ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ. తమ సంస్థ చేపట్టిన నిర్మాణాలన్నీ సక్రమేనని స్పష్టం చేశారు. ఇక కుటుంబసభ్యుల కిడ్నాప్ డ్రామాను వక్రీకరిస్తున్నారని మండిపడ్డ ఎంవీవీ.. విశాఖలో పవన్‌కు అడుగుపెట్టే అర్హతే లేదన్నారు. అంతేకాకుండా పవన్ కల్యాణ్‌పై పర్సనల్ ఎటాక్‌కి దిగారు ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ. పెళ్లిళ్లు, పిల్లల ప్రస్తావన తీసుకొచ్చారాయన. మరోవైపు చంద్రబాబు మోచేతి నీళ్లు తాగుతున్నాడని విమర్శించారు.

# స్టాఫ్ నర్సుల ఇష్టా రాజ్యం...

కర్నూలు, ఆగస్టు 14, :ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన స్టాఫ్ నర్సులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారా..? రాత్రి డ్యూటీ చేయాలని చెప్పే అధికారులను ఎస్సీ, ఎస్టీ కేసులతో పాటు లైంగిక దాడి కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారా ?, వీరి తీరుతో వైద్యులు నిస్సహాయ స్థితిలో ఉంటున్నారా ? ఈ విషయాలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం లేదా ? అంటే అవున నే సమాధానం వినిస్తోంది. స్టాఫ్ నర్సులు ఆ వృత్తికి కళంకం తెస్తూ సేవలను నీరు గారుస్తున్నారు. ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెడుతూ విష సంస్కృతికి బీజం వేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సీహెచ్‌సీలు 18, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 87, అర్బన్ హెల్త్ సెంటర్లు 44, ఏరియా ఆస్పత్రులు 5 ఉన్నాయి. ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యాధికారులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, సీటీ ఒకరు, ఫార్మాసిస్టు ఒకరు, ఎంఎన్‌ఓలు ముగ్గురు, ఎఫ్ఎన్ఓ ఒకరు, సూపర్ వైజర్ ఒకరు, జూనియర్ అసిస్టెంట్ ఒకరు చొప్పున ఉంటారు. వీరిలో స్టాఫ్ నర్సుల తీరు ప్రజలకు ఇబ్బందిగా మారింది. ప్రతి ప్రాథమిక ఆరోగ్య



కేంద్రంలో ముగ్గురు చొప్పున ఉండే వీరిలో ఒక్కొక్కరు కేవలం పది రోజుల పాటు విధులు నిర్వహించాల్సి ఉంది. కానీ ఎవరు కూడా రాత్రి వేళల్లో వివిధ కారణాల నెపంతో విధులు నిర్వహించడం లేదనే విమర్శలు న్నాయి. ఈ విషయాలపై సంబంధిత వైద్యాధికారులు స్టాఫ్ నర్సులను నిలదీసి రాత్రి విధులు ఎందుకు నిర్వహించడంలేదని, ఇలా చేస్తే ఉన్నతాధికారుకు రిపోర్టు చేస్తానని హెచ్చరిస్తే వారిపై కక్ష పెంచుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. స్టాఫ్ నర్సులు తప్పుడు కేసులు పెడుతున్నట్లు వైద్యాధికారులు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరైతే వీరి ఆగడాలు భరించలేక ఇతర ప్రాంతాలకు బదిలీ చేయించుకుంటున్నారు. లేదంటే దీర్ఘకాలిక సెలవు పెడుతున్నారు. నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం ఎర్రమఠం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. అందులో వివిధ కేడర్లలో 13 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఆరోగ్య కేంద్రం పరిధిలో దాదాపు 10 గ్రామాలు ఉన్నాయి. నల్లమల అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండడంతో చెంచులు, ఇతర సామాజిక తరగతికి చెందిన ప్రజలు వైద్య సేవల కోసం ఇక్కడికి వస్తుంటారు. ఇక్కడ సరైన వైద్య సేవలు అందించకుంటే 24 కిలోమీటర్ల దూరంలో ఉంటే కొత్తపల్లి, దాదాపు 30 కిలోమీటర్ల దూరం ఉండే ఆత్మకూరు పట్టణ కేంద్రాలకు వెళ్లాల్సిందే. అయితే ఇక్కడ విధులు నిర్వహించే స్టాఫ్ నర్సులు మరీ దారుణంగా వ్యవహరిస్తున్నారు. ఈ ఆస్పత్రిలో ముగ్గురు స్టాఫ్ నర్సులున్నారు. వీరు నెలకు రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు వేతనాలు తీసుకుంటున్నారు. వీరు ఏనాడూ రాత్రి విధులకు హాజరైన దాఖలాలు లేవు. 2020లో సత్యంరెడ్డి అనే ఉద్యోగిని, 2021లో వైద్యాధికారి శ్రీనివాసులు నాయుడును రకరకాల కారణాలతో కేసులు బనాయించి జైలుకు పంపారు. వీరికి పేషెంట్ శీలం యేసురత్నం, మరి కొందరు సహకరించారు. ఇలా ప్రజా వైద్యాన్ని అపహాస్యం చేస్తూ 24 గంటలూ అందాల్సిన సేవలకు తిలోదకాలిస్తున్నారు. ఆస్పత్రిలో వైద్య సిబ్బంది ఎవరూ ఉండడం లేదని నా దృష్టికి వచ్చింది. కానీ ఇక్కడ సిబ్బంది నా మాట లెక్క చేయడం లేదు. దీంతో వారిని ఏమీ అనలేకపోతున్నాను. ఐదు రోజుల నుంచి గ్రామానికి చెందిన వారు సిబ్బందిపై ఫిర్యాదు చేశారు. దీంతో నేను జిల్లా ఉన్నతాధికారికి రిపోర్టు పంపాను. ఇక్కడ అంబులెన్స్ అవసరమని చెప్పాను. స్టాఫ్ నర్సులు రాత్రి విధులు నిర్వహించడం లేదని ఫిర్యాదులు అందాయి. వీటిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా వైద్య శాఖ పని చేస్తుంది. అందుకు ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసింది. ఎక్కడా కూడా వైద్య సేవలు అందలేదని ప్రజలు తమకు ఫిర్యాదు చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

# కడపలో బిగ్ ఫైట్..!

కడప, ఆగస్టు 14, : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన సొంత నియోజకవర్గంలోని ఇడుపులపాయ గ్రామ పంచాయతీ ఉప ఎన్నికలు అధికార వైసీపీకి, ప్రతి పక్ష తెలుగుదేశం పార్టీకి మధ్య వివాదం రేపుతున్నాయి. ఇడుపులపాయలో పోటీ పెట్టి వైసీపీని ఎంతోకొంత అక్కడ డ్యామేజ్ చేసి రాజకీయంగా వాడుకోవాలన్న ప్రణాళిక తో తెలుగుదేశం ప్రయత్నిస్తుండగా, తెలుగుదేశం పార్టీ ఆ వైపే చూడకూడదని వైసీపీ దృష్టి పెట్టింది. ఇప్పటికే పులివెందుల నుంచి రెండు సార్లు ఎమ్మెల్సీగా దేశం అభ్యర్థులు గెలవడంతో దాన్ని వైనాట్ పులివెందుల అన్నట్టుగా తెలుగుదేశం రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారానికి వాడుకొంటోంది. ఇప్పుడు వైఎస్ కుటుంబం అంటే ఇడుపులపాయ, ఇడుపులపాయ అంటే వైఎస్ కుటుంబంగా ఉన్న ఇక్కడ తెలుగుదేశం పోటీకి దిగితే గెలుపోటములు పక్కన పెడితే ఇడుపుల పాయలోనే వైసీపీకి దేశం ఎదురొడ్డినట్ల అవుతుంది. ఈ ప్రచారం కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తికరంగా మారుతుంది. ఈనేపథ్యంలో అక్కడి పంచాయితీ ఉప ఎన్నిక ఈ రెండు పార్టీల మధ్య వివాదాస్పదంగా మారింది. ఇడుపుల పాయలో పంచాయితీ ఉప ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం లేక అడ్డదారులు వెతుకుతున్నారని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి విమర్శించారు.. ఉప ఎన్నికల్లో పోటీ చేస్తున్న తమ పార్టీ అభ్యర్థికి ఇంటి పన్ను చెల్లింపు, కుల ధ్రువీకరణ పత్రాలు అధికారులు ఇవ్వకుండా తప్పించుకుని తిరుగుతున్నారన్నారు. తమ అభ్యర్థి నామినేషన్‌ను పరిశీలనలోనే తిరస్కరించాలని చూస్తే ఇంతకంటే దౌర్భాగ్య పరిస్థితి జగన్‌కు వుండదన్నారు. ఇడుపులపాయ సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ గెలుస్తుందన్న భయంతోనే నామినేషన్‌ను తిరస్కరించేందుకు వైసీపీ నేతలు పన్నాగం పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. వేంపల్లె ఎంపీడీవో మల్లికార్జునరెడ్డి తమ అభ్యర్థికి ధ్రువపత్రాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం బీటెక్ రవి జిల్లా పరిషత్ ఎగ్జిక్యూటివ్ అధికారి సుధాకర్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. తెలుగుదేశం పార్టీ చిత్తశుద్ధితో నామినేషన్ వేయాలే కానీ, అధికారులు, వైసీపీ నాయకులపై ఆరోపణ చేయడం ఏంటని వేంపల్లి జెడ్పిటిసి, వైసిపి నేత రవి కుమార్ రెడ్డి విమర్శించారు. పులివెందల తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి బీటెక్ రవి అధికారులపై ఆరోపణ చేయడం సిగ్గుచేటు అన్నారు. నామినేషన్లో సరైన సమాచారం లేకపోవడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాన్ని తిరస్కరించారని చెప్పారు. వైసీపీ సర్పంచ్ అభ్యర్థిగా బలపరిచిన తుమ్మలూరు నాగమ్మ, వార్డ్ మెంబర్‌గా బలపరిచిన కోలా శ్రీరాములు నామినేషన్లను అధికారులు ఆమోదించాలని కోరారు.

# కాసులు కురిపిస్తున్న కురులు

తిరుమల, ఆగస్టు 14, :ఆపదమొక్కుల స్వామి శ్రీ వెంకటేశ్వరుడి కి తలనీలాలు సమర్పించడం భక్తుల మొక్కులో ఒక భాగం. కోరుకున్న మొక్కులు తీరగానే తలనీలాలు సమర్పించి శ్రీవారిని దర్శించుకునే భక్తుల సంఖ్య తిరుమల కొండలు అంతకంతకు పెరుగుతూనే ఉంది. రోజు తిరుమల శ్రీవారిని దర్శించుకునే భక్తుల్లో చాలామంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కు తీర్చుకుంటుండంతో వెంకన్న ఆదాయం అంతకంతకు పెరుగుతోంది. తిరుమలలో భక్తులు తలనీలాలు సమర్పించేందుకు టీటీడీ కళ్యాణకట్ట తో పాటు చాలా ప్రాంతాలను ఏర్పాటు చేసింది. ఇలా గుండు కొట్టి గోవిందుడి మొక్కు తీర్చుతున్న భక్తుడి ఆదాయం ఏటా టీటీడీ కి రూ. 120 కోట్లకు పైగానే ఉంటుంది. ఇలా గత ఐదారేళ్లుగా టీటీడీకి తలనీలాల ఆదాయం అంతకంతకు పెరిగి ఈ ఏడాది మరో రికార్డు ను నమోదు చేయబోతోంది. ఇప్పటిదాకా ఏటా రూ.120 కోట్లు వస్తోందని టీటీడీ లెక్కలు చెబుతుండగా ఈ ఏడాది రూ. 150 కోట్లుకు పైనే ఉండబోతోంది. ప్రతి ఏడాది నాలుగు సార్లు ఈ ఆక్షన్ నిర్వహిస్తున్న టీటీడీ తలనీలాలను గ్రేడులు వారీగా విభజించి ఈ ఆక్షన్ నిర్వహిస్తోంది. 5 గ్రేడులుగా విభజించి తలనీలాలను వేలం వేస్తున్న టీటీడీ మొదటి మూడు గ్రేడ్ లలో డై, బ్లాక్ హెయిర్ ను వేరుచేసి రెండు రకాలుగా విభజిస్తుంది. తిరుపతిలోని టిటిడి మార్కెటింగ్ గొడన్ లో భక్తుల తలనీలాల గ్రేడింగ్ ప్రక్రియ చేపడుతున్న టీటీడీ తిరుమల నుంచి ఒక రోజుకు 1400 కేజీల తలనీలాలను సేకరిస్తోంది. తిరుమలలోని టీటీడీ కళ్యాణ కట్ట, గెస్ట్ హౌస్ లో తలనీలాలు సమర్పించేందుకు ఏర్పాట్లు చేసిన టిటిడి తలనీలాలు సేకరణలో పలు జాగ్రత్తలు కూడా పాటిస్తోంది. మొక్కులో భాగంగా భక్తులు సమర్పించే తలనీలాలు రోజూ తడిగా ఉండే 1400 కేజీలు కాగా తలనీలాలు డ్రై అయ్యాక ఒకమెట్రిక్ టన్ను వరకు టిటిడి గోడౌన్ కు చేరుతుంది. కరోనా తర్వాత శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లుగానే తలనీలాల ఆదాయం టీటీడీ కి విపరీతంగా పెరిగింది. ఐదారేళ్ళుగా ఏటా రూ. 120 కోట్లకు పైగా టిటిడి కి ఆదాయం వస్తుండగా 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ.120



కోట్లు ఆలయం టిటిడి కి వచ్చింది. ఇక 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను ఇప్పటివరకు రెండుసార్లు ఈ ఆక్షన్ నిర్వహించిన టీటీడీ ఇప్పటివరకు దాదాపు రూ.105 కోట్ల మేర ఆదాయం పొందింది. మరో రెండు సార్లు ఈ ఆక్షన్ నిర్వహించేందుకు టీటీడీ సిద్ధమవుతుండగా ఈ ఆర్థిక సంవత్సరం ఆదాయం ఏకంగా రూ. 150 కోట్లకు పైగా ఉంటుందని టీటీడీ అంచనా వేస్తోంది. దీంతో భక్తులు సమర్పించే కురులు శ్రీవారి హుండీ ఆదాయానికి కాసులను కురిపిస్తోంది.

# ప్రజలు పోరాడి సాధించుకున్న భూమి ప్రజలకే పంచాలి



ఇబ్రహీంపట్నం ఆగస్టు 14 ప్రజాపాలన ప్రతినిధి:రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామంలో సర్వేనెంబర్ 176లో 3 ఎకరాల భూమిని ప్రజలందరికీ పంచాలని సోమ వారం నాడు పోల్కంపల్లి గ్రామ పంచాయతి కార్యాలయం వద్ద అఖిల పక్ష రాజకీయ పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఎం మండల నాయకులు అమనగంటి వెంకటేష్,పి.జగన్ బిఅర్ఎస్ గ్రామ అధ్యక్షులు గుండ్ల దానయ్య, బీజేపీ నాయకులు మొుగిలి గణేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండ్ల వెంకటేశ్, సీపీఐ మండల కార్యదర్శి పుల యాదయ్య, మజి వైస్ ఎంపీపీ కొమ్మిడి శేఖర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ చెరుకూరి అండాలు గిరి,ఉప సర్పంచ్ కొమ్మిడి జంగారెడ్డి, ఎంపీటీసీ చెరుకూరి మంగ రవీందర్ ,బీఎస్పీ నాయకులు పి. గణేష్ లు మాట్లాడుతూ సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆనాడు పోరాడి సాధించి 60 ఎకరాల భూమిని గ్రామ ప్రజలందరికీ పంచగా మిగిలిన మూడు ఎకరాల భూమిని పార్టీ ప్రజల అవసరాలరీత్యా ఉంచగా అట్టి భూమిని ఆనాటి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దేరంగుల నరసింహ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయటం జరిగింది. అయన టిఆర్ఎస్ పార్టీలోకి వెళ్లిన తర్వాత ఈభూమి నాదేనని అంటూ ప్రజలను మోసం చేస్తున్నాడు. ఈభూాలో గత 30సంవత్సరాల నుంచి గ్రామానికి చెందిన దాదాపు 500 కుటుంబాలు సాగుచేసుకుంటున్నాయి. ఈ ఎలాగైనా భూమిని కాజేయాలని దుర్బుద్ధితో ఇందులో సగం భూమిని తన కుమారుడైన దేరంగుల రాజు పేరు మీద అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశాడు. ఈ భూమిని ప్రజలకు పంపిణీ చేయాలని అనేకసార్లు అధికారులకు విన్నవించిన స్పందించటం లేదు. ఈ భూమి విషయంలో ఎమ్మెల్యే జోక్యం చేసుకుని డి.నర్సింహ్మ , డి.రాజు ల పేరుమీద ఉన్న భూమిని వెంటనే గ్రామంలోని పేదలకు పంపిణీ చేసేటట్లు చూడాలని అన్నారు. లేదంటే ప్రజాగ్రహానికి గురికావడం తప్పదన్నారు. ఈకార్యక్రమంలో సీపీయం కార్యదర్శులు జీ అశోక్, ఎ.నర్సింహ్మా, పి వెంకన్న, పి స్వామి, పీఎన్ఎం జిల్లా కార్యదర్శి గడ్డం గణేష్, మండల కార్యదర్శి పి దనేశ్వర్, సీపీయం నాయకులు కె.ఇస్తారీ, జీ నర్సింహ, కర్ణాకర్ రెడ్డి, బాల్ రాజ్, యాదయ్య , బీజేపీ నాయకులు గుండ్ల యాదయ్య, కావలి రమేష్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కావలి లక్ష్మయ్య, టిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ధనరాజ్, గ్రామ పెద్దలు గుండ్ల బాబయ్య, కంబలపల్లి పెంటయ్య మహిళలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కళాబృందం అవగాహన కార్యక్రమాలు



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సురేష్ చారి, ఆగస్టు14) : పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, కే సురేష్ కుమార్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లాలోని పెంచికల్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో యువతకు మత్తు పదార్థాలు వినియోగించడం పట్ల జరిగే అనార్థాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు, రోడ్డు భద్రత నిబంధనలు, పోలీస్ చట్టాల గురించి, సిఈఐఆర్ (దొంగతనం ఫోన్ల రికవరీ) మొదలగు వాటి గురించి అవగాహన నిర్వహించడం జరిగిందన్నారు. సైబర్ నేరాలు జరిగితే1930 నంబర్ కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని, గ్రామాలలో ఎవరైనా అపరిచిత వ్యక్తుల పట్ల అనుమానం ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్ దయాల్ 100 కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ సందర్భంగా కళాబృందం సభ్యులు ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులపై "పాటల రూపంలో మాటల రూపంలో" అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెంచికల్పేట్ ఎస్సై కొమురయ్య, పాఠశాల హెడ్మాస్టర్ శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది, కళాబృందం ఇన్చార్జ్ సాగర్, లింగయ్య, రోహిత్,సంఘవి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటా ఇన్నోవేటర్కు జిల్లా నుండి ఇద్దరు ఎంపిక



మంచిర్యాల బ్యూరో, ఆగస్టు 14, ప్రజాపాలన :రాష్ట్ర ప్రభుత్వం ప్రజలలో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికి తీసేందుకు అన్ని వర్గాల వారికి అవకాశం కల్పిస్తూ తలపెట్టిన ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి జిల్లా నుండి ఇద్దరు అభ్యర్థులు ఎంపికైనట్లు జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల భవన సముదాయంలో ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్, జిల్లా సైన్స్ అధికారి మధుబాబుతో కలిసి ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ రంగాలలో ప్రజా ఉయోగకర వినూత్న ఆవిష్కరణలు, నూతన పరికరాలు ఆవిష్కరించడం ద్వారా ప్రజలకు సులవైన మార్గాలలో పనులను సులభతరం చేయడంతో పాటు సౌకర్యాలు అందించేందుకు ఆవిష్కరణలు రూపొందించే ఇన్నోవేటర్ను గుర్తించి ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం ద్వారా ప్రోత్సహిస్తుందని, ఈ క్రమంలో ప్రతి సంవత్సరం నిర్వహించే ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి జిల్లా నుండి ఇద్దరు ఎంపికయ్యారని తెలిపారు. జిల్లాలోని మందమర్రి ప్రాంతానికి చెందిన కటకం వినయకుమార్ మోటారుతో నడిచే సైకిల్ ఆవిష్కరించారని, తాండూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎండి. మక్సుద్ అత్యంత తక్కువ ఖర్చుతో ప్రొజెక్టర్ రూపొందించారని తెలిపారు. ఈ ఆవిష్కరణలను ఈ నెల 15వ తేదీన జిల్లాలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ప్రదర్శించి ఆవిష్కర్తలకు ప్రశంసా పత్రం అందించడం జరుగుతుందని తెలిపారు.

## గోల్కొండ కోటలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు పరిశీలించిన సీఎస్

హైదరాబాద్ : గోల్కొండ కోటలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సోమవారం పరిశీలించారు. వేదికతో పాటు వేడుకలు నిర్వహించే ప్రాంతాల్లో కలియతిరిగిన సీఎస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని అధికారులంతా సమన్వయంతో పనిచేసి, తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. బ్లూ బుక్ ప్రకారం పోలీసుశాఖ తగిన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్ మళ్లింపుల సమాచారాన్ని ముందుగానే ప్రజలకు తెలియజేయాలన్నారు. ట్రాఫిక్ నిర్వహణ, విద్యుత్తు, సీటింగ్, నీటి సరఫరా, పారిశుద్ధ్యం, వైద్యసేవలు, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లను సీఎస్ పరిశీలించారు. వేడుకలు సజావుగా నిర్వహించేందుకు, వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లను జీఏడీ అధికారులు సీఎస్కు వివరించారు. ట్రాఫిక్ అదనపు సీపీ సుధీర్బాబు, ఆర్అండ్బీ సెక్రటరీ శ్రీనివాసరాజు, జీహెచ్ఎంసీ కమిషన్ రోనాల్డ్రోస్, జలమండలి ఎండీ దానకిషోర్, ఐఅండ్పీఆర్ కమిషనర్ అశోక్రెడ్డి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## లక్ష మందితో చేవెళ్ల సభ



చేవెళ్ల ఆగస్టు 14, (ప్రజా పాలన):ఈ నెల 18నా చేవెళ్లలో ఎస్సి ఎస్టీ డిక్లరేషన్ సభను విజయవంతం చేయండి అని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ పేర్కొన్నారు.చేవెళ్ల మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చల్ల నరసింహరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులతో ఈ నెల 18న జరిగే ఎస్సి ఎస్టి డిక్లరేషన్ సభ కోసం సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి అతిధులుగా మాజీ మంత్రి గడ్డం ప్రసాద్,అనిల్ యాదవ్ పాల్గొన్ని వారు మాట్లాడుతూతెలంగాణ రాష్ట్రములో అన్ని వర్గాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి రైతు డిక్లరేషన్, యూత్ డిక్లరేషన్ మాదిరిగానే ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ చేయడానికి ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జునా ఖర్గే వస్తున్నట్లు అంబేద్కర్ ఆలోచన విధానం ప్రకారం ఎస్సీ డిక్లరేషన్ తీసుకోవడం జరిగిందని స్థానికుల అభిప్రాయం తీసుకొని సభ ఏర్పాటు చర్యలు తీసుకుంటామని ఈనెల 18న సాయంత్రం నాలుగు గంటలకు సభ జరుగుతుందని ఈ సభకు పెద్ద ఎత్తున లక్ష పైచిలుకు మందితో సభ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం సభ కోసం ఫార కాలేజ్, కెవిఆర్ గ్రౌండ్లను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో చింపుల సత్యనారాయణరెడ్డి,మధుసూదన్ రెడ్డి,సున్నపువసంతం,పామేనా భీంభారత్, షాబాద్ దర్శన్,ఆగిరెడ్డి, దేవర వెంకట్ రెడ్డి, వెంకట్ స్వామి, మధుసూదన్ గుప్తా,జనర్దన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి,గౌరీ సతీష్, పెంటారెడ్డి,శ్రీకాంత్ రెడ్డి,వీరేందర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్,శ్రీనివాస్ యాదవ్, ప్రభాకర్, ఐదు మండల అధ్యక్షులు పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## ఆంజనేయుడి కళ్లు తీసుకెళ్లారు

**ఊళ్లో కంటి చూపు కోల్పోయిన ఇద్దరు**

అదిలాబాద్, ఆగస్టు 14, :ఆంజనేయుడి ఆలయం.. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం డోంగర్ గావ్ గ్రామం.. హనుమాన్ ఆలయంలోని దేవుడి కళ్లు మాయం.. ఎమ్మెల్యే రేఖానాయక్ ఎత్తుకెళ్లారంటూ గ్రామస్తుల ఆందోళన..నెల రోజుల క్రితం ఎమ్మెల్యే రేఖా నాయక్ తమ గ్రామంలో కార్యాలయం నిర్మాణ భూమి పూజ కు వచ్చారు.. అప్పుడే ఆంజనేయుడి కళ్లు తీసుకెళ్లారు అంటున్నారు. ఎమ్మెల్యే ఆంజనేయ స్వామి కళ్లు తీసుకెళ్లడమేంటి.. ఒకవేళ తీసుకున్నారే అనుకుందాం.. ఎందుకు తీసుకున్నారు.. ఈ ప్రశ్నలే ఇప్పుడు జిల్లా అంతటా హాట్ టాపిక్ అయ్యాయి..ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖ నాయక్ దేవుని విగ్రహం మీద ఉన్న కళ్లు తీసుకెళ్లిన రోజు నుంచి గ్రామంలో.. ఏదో ఒక సంఘటన జరుగుతోందని వాపోతున్నారు. 10 రోజుల తరువాత గ్రామ పటేల్ మాడవి దేవరావు కళ్ళు చూపు ని కోల్పోయాయి. 5 రోజుల కింద గ్రామ మాజీ పటేల్ పెందుర్ బాబు ఆకస్మాతుగా కంటి చూపుని కోల్పోయారు. ఇది అరిష్టంగా చెప్పుకుంటున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. వీరి ఆందోళనకు కాంగ్రెస్ నేత వినోద్ నాయక్ మద్దతుగా ఉన్న ఈ వీడియో లు ప్రస్తుతం సోషల్ మీడియాలో కూడా వైరల్ అవుతుండడం చర్చనీయాంశంగా మారింది.డొంగర్గాం గ్రామం నుంచి తాను వెండి కళ్ళు తీసుకెళ్లిన మాట వాస్తవమేనని.. బంగారు కళ్ళు చేయిస్తానని తెలిపారు. త్వరలోనే మొక్కు తీర్చుకుంటానని.. కాంగ్రెస్ వారు అనవసర రాజకీయం చేస్తున్నారని ఎమ్మెల్యే ఎదురుదాడికి దిగారు. తనపై అనవసర విమర్శలు దుష్ప్రచారం చేసేవారు.. డోంగర్గాం గ్రామం కి రావాలని అక్కడే గ్రామస్తుల సమక్షంలో మాట్లాడదామని పేర్కొన్నారు. ఇంద్రవెల్లి మండలం డోంగర్ గావ్ విషయం తెలుసుకున్న ఖానాపూర్ కాంగ్రెస్ నాయకులు వినోద్ నాయక్ హుటాహుటిన గ్రామానికి బయలుదేరి అర్ధరాత్రి గ్రామస్తులతో మాట్లాడారు.గుడిలో రేఖనాయక్ చేసిన అపచారం వల్లే ఇదంతా జరుగుతోందన్నారు. ఇద్దరి కంటి చూపు కోల్పోనికి కారణం అయినా ఎమ్మెల్యేని వెంటనే ఎమ్మెల్యే పదవి నుండి భర్తరఫ్ చేయాలి. వెంటనే ప్రభుత్వం సిట్టింగ్ జడ్జిని అపాయింట్ చేసి సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. దేవుడు పేరు తో రాజకీయం చేసే బీజేపీ పార్టీ నాయకులు ఇవాళ మౌనంగా ఉండడం వాళ్ళ రెండు నాలుకల ధోరణి కి నిదర్శనం.. ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ కి ఛలో డోంగర్ గావ్ సవాల్ విసిరారు.

## జిల్లాల పర్యటనలకు కేసీఆర్

హైదరాబాద్, ఆగస్టు 14, :తెలంగాణ ముఖ్య మంత్రి కేసీఆర్ జిల్లాల పర్యటనకు ముహూర్తం ఖరారైంది. రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిస్థితులు, సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో.. ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు సీఎం కేసీఆర్. ఆగస్టు చివరివారం నుంచి రెండు జిల్లాల్లో పర్యటనలు చేస్తూ.. బహిరంగ సభల్లో పాల్గొనబోతున్నారు. ఈ సభల ద్వారా ఎన్నికల వాతావరణం సృష్టించేలా గులాబీ బాస్ ప్రణాళికగా తెలుస్తోంది.అసెంబ్లీ సమావేశాలకు ముందు ఆగస్టులోని ఈ వారం చివరలో మెదక్ జిల్లా, సూర్యాపేట జిల్లాలలో ప్రభుత్వ కార్యక్రమాలతోపాటు, పలు బహిరంగ సభల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ రోడ్ మ్యాప్ సిద్దమయింది. అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీస్కెళ్లడంతో పాటు.. తన బహిరంగ సభల ద్వారా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలని ఎండగట్టడమే సీఎం కేసీఆర్ వ్యూహంగా తెలుస్తోంది.ఆగస్టు 19న మెదక్ జిల్లాలో కలెక్టర్ కార్యాలయాన్ని, జిల్లా పోలీసు (ఎస్పీ) కార్యాలయాన్ని ప్రారంభించి.. బహిరంగ సభలో పాల్గొంటారు కేసీఆర్. సభ కంటే ముందు జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. ఇప్పటికే మెదక్ జిల్లా నాయకులు.. గులాబీ అధినేత పాల్గొనే సభా నిర్వహణా పనుల్లో తలమునకలై ఉన్నారు.ఇక ఆగస్టు 20న సూర్యాపేట జిల్లాలో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించి.. అనంతరం కొత్తగా నిర్మించిన ఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అదే సందర్భంలో..సీఎం కేసీఆర్ చేతుల మీదుగా నూతనంగా నిర్మించిన మెడికల్ కాలేజీ ప్రారంభించనున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల తర్వాత సూర్యాపేటలో నూతనంగా నిర్మించిన బిఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అనంతరం పార్టీ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని సభలో ప్రసంగిస్తారు సీఎం కేసీఆర్.ఇదిలావుంటే తొలి జాబితాను బీఆర్ఎస్ పార్టీ రెడీ చేసినట్లుగా సమాచారం.

## బీసీ కులవృత్తులకు లక్షరూపాయల చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మెచ్చా



అశ్వరావుపేట ప్రజా పాలన ప్రతినిధి అశ్వరావుపేట మండలంలోని స్థానిక గిరిజన భవన్లో ఈరోజు అశ్వరావుపేట నియోజకవర్గ వ్యాప్తంగా 300 మంది బీసీ కుల వృత్తులకు రూ.లక్ష విలువ చేసే చెక్కుల పంపిణీ చేసిన MLA మెచ్చా నాగేశ్వరరావు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మెచ్చా మాట్లాడుతూఇది నిరంతర ప్రక్రియ అని వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కులవృత్తుల ఆర్థిక అభివృద్ధిలో భాగంగా అశ్వారావుపేట నియోజకవర్గ వ్యాప్తంగా 300 మంది లబ్ధిదారులకు రు.లక్ష విలువ చేసే చెక్కులను గత ప్రభుత్వాలు బీసీ కులవృత్తులను పట్టించుకోలేదన్నారు. బ్యాంకులతో సంబంధం లేకుండా నేరుగా లబ్ధిదారుని పేరుపై లక్ష రూపాయలు అందచేస్తున్న ఏకైక ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ గారి ప్రభుత్వంమన్నారు.బీసీ కులవృత్తిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు.బీసీ కుల వృత్తులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం పంపిణీ నిరంతర ప్రక్రియాని, ప్రతినెలా 300 మందికి సాయమందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఈ కార్యక్రమంలో 5మండలాల అధికారులు,జెడ్పీటీసీలు,ఎంపీపీ లు,వైస్ ఎంపీపీ లు, ఎంపీటీసీలు,మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శిలు,సర్పంచ్ లు,ఉప సర్పంచ్ లు,వార్డ్ మెంబర్ లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రీన్ వుడ్ పాఠశాలను సీజ్ చేయాలి: ఐక్య విద్యార్థి సంఘాలు



మంచిర్యాల టౌన్, ఆగష్టు 14, ప్రజాపాలన: గ్రీన్ వుడ్ పాఠశాలను సీజ్ చేయాలని సోమవారం రోజు ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో సి బి ఎస్ సి సిలబస్ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న గ్రీన్ వుడ్ పాఠశాలను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల పలు ఆందోళన కార్యక్రమాలు చేస్తాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిప్పకుర్తి శ్రీనివాస్ జుమ్మడి గోపాల్ షేక్ సల్మాన్ పషా రేగుంట క్రాంత్ కుమార్చేరాల వంశీ బచ్చలి ప్రవీణ్ కుమార్ పూరెళ్ళ నితీష్ సంజయ్ ఫైతర్ సాగర్ అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి.

**జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్**



మంచిర్యాల బ్యూరో, ఆగస్టు 14, ప్రజాపాలన : జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్న వేడుకలలో ప్రభుత్వ విప్, చెన్నూర్ నియోజకవర్గ శాసనసభ్యులు బాల్క సుమన్ ముఖ్య అతిథిగా పాల్గొని ఈ నెల 15వ తేదీన ఉదయం 11 గం॥లకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని, 11.05 గం? లకు గౌరవ వందన స్వీకారం అనంతరం 11.20 గం?ల నుండి 11.40 గం॥ల వరకు జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రగతి సందేశాన్ని అందిస్తారని, 11.40 గం?లకు స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తారని, 11.50 నుండి మధ్యాహ్నం 12.20 గం॥ల వరకు అభివృద్ధి కార్యక్రమాల ప్రదర్శన ఉ టుందని, మధ్యాహ్నం 12.20 గం.ల నుండి 12.50 గం॥ల వరకు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, 12.50 గం?ల నుండి 1.30 గం?ల వరకు జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంసా పత్రాల పంపిణీ, 1.30 గం?ల నుండి 1.45 గం॥ల వరకు వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్ళను సందర్శించి, వివిధ పథకాలలో ఎంపికైన లబ్దిదారులకు పథకం ఫలాలు అందించడం జరుగుతుందని తెలిపారు. అటవీ, వ్యవసాయ, ఉద్యానవన, పట్టుపరిశ్రమ, మత్స్య, పశు సంవర్ధక, మిషన్ భగీరథ, గ్రామీణ నీటి పారుదల, పంచాయతీ, వైద్య-ఆరోగ్య, ఆబ్కారీ, అగ్నిమాపక, రోడ్లు-భవనాలు, రెండు పడక గదుల ఇండ్లు, పంచాయతీరాజ్, విదయ, ఇంటర్మీడియట్ విద్య, పరిశ్రమలు, సింగరేణి, క్రీడా-యువజన సర్వీసులు, సంక్షేమశాఖల ఆధ్వర్యంలో శఖటాల ప్రదర్శన, అటవీ, సంక్షేమం, వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్య, మహిళ, శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల, గ్రామీణాభివృద్ధి, విద్య, ఆబ్కారీ, బ్యాంకులు, క్రీడా-యువజన సర్వీసుల శాఖల ఆధ్వర్యంలో స్టాళ్ళు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ శాఖల అధికారులు, జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రజలు, యువత, విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

# రైతుల రుణమాఫీ వివరాలు

## బ్యాంక్‌ల వద్ద నోటీస్ బోర్డ్‌లో పెట్టాలి
## టి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మాదగోని జంగయ్య గౌడ్



ఇబ్రహీంపట్న ఆగస్టు తేదీ 14 ప్రజాపాలన ప్రతినిధి :మంచాల మండలం టి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మాదగోని జంగయ్య గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తాం అని ప్రకటన చేసింది తప్ప రుణమాఫీ ఎవ్వరికీ అవుతుంది ఎవ్వరికీ మాపి కావటం లేదో అర్థం కాక రైతులు ఆందోళన చెందుతున్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేస్తాం అని గత ఎన్నికల్లో రైతులకు మాట ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీర్ అప్పుడే రుణమాఫీ చేయక పోవటంతో బ్యాంక్ లో రైతుల అప్పులు వడ్డీకి వడ్డీ పెరిగి తీసుకున్న అప్పు రెండింతలు అయ్యింది అన్నారు ఇది ముమ్మాటికీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వనిర్లక్ష్యం వే అన్నారు ప్రభుత్వమే రుణమాఫీ ప్రకటన చేయకుంటే రైతులు ఎప్పటికప్పుడు వడ్డీ కట్టు కునేవాళ్ళు అప్పు భారం తగ్గేది అన్నారు ముఖ్యమంత్రి కేసీఆర్ రుణమాఫీ మాపి చేస్తాం అని ప్రకటన వాళ్ళ రైతులు బ్యాంక్ లో వడ్డీ చెల్లించక పోవటంతో రైతులకు బ్యాంక్ లో ఎక్కడి నుండి అయిన రైతుల బ్యాంక్ ఖాతాలో డబ్బులు జామ అయితే వెంటనే బ్యాంక్ అధికారులు రైతుల డబ్బులు బ్యాంక్ జామ చేసుకుంటారు రైతు బంధు డబ్బులుకుడా జామ చేసుకొని రైతులను బ్యాంక్ అదికారులు మోసం చేస్తున్నారు ఇప్పుడు రుణమాఫీ అయిన ఎ ఒక్క రైతుకు చేతికి డబ్బులు రావు అన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం వాళ్ళ రైతులు నిండ మోస పోయారు ఇప్పట్టికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రుణమాఫీ ఎ రైతుకు ఎంత మాపి చేస్తున్నారు వడ్డీ ఎంత అయ్యింది అని రైతుల పూర్తి వివరాలు బ్యాంక్ ల వద్ద నోటీస్ బోర్డ్ లో పెట్టేల ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి చాలా మంది రైతుల అప్పులు ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం వాళ్ళ వడ్డీకి వడ్డీ పెరిగి లక్ష మించి పోయాయి ప్రభుత్వం మాత్రం లక్ష మాపి ప్రకటన చేయటం సరైన పద్ధతి కాదు పూర్తి స్థాయిలో వడ్డీతో సహా రుణమాఫీ చేసి కొత్త రుణాలు మంజూరు చేసి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలి అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వని డిమాండ్ చేస్తున్నాం లేని పక్షంలో రైతుల పక్షాన పోరాటం చేసి రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ కు తగిన గుణపాఠం చెప్పుతాం అని హెచ్చరిస్తున్నాం .

## సీతారామాంజనేయ ఆలయ కమిటీ అధ్యక్షులుగా రమాకాంత్



తల్లాడ, ఆగస్టు 14 (ప్రజాపాలన న్యూస్ ):మండల పరిధిలోని కేశవపురం గ్రామంలో గల లిశ్రీ సీతారామాంజనేయ స్వామిలి ఆలయ నూతన కమిటీ ఎన్నిక గ్రామం పెద్దల సమక్షంలో ఆదివారం ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన ఆలయ కమిటీ అధ్యక్షుడిగా కట్టా రమాకాంత్‌లి,ప్రధాన కార్యదర్శి చావా విష్ణువర్ధన్ రావు,కోశాధికారి సాదం రమేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.అనంతరం ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులుగా మన్నేపల్లి రామారావు, వనిగండ్ల కృష్ణమూర్తి,కట్టా చిన్న వెంకటేశ్వరరావు,పసుపులేటి గోపాలరావు,అడపాల నాగేశ్వరావు,చుండూరి ప్రభాకర్ రావు,కట్ట నాగేశ్వరావు,వనిగండ్ల మాధవరావు,చిన్నంశెట్టి శ్రీనివాసరావు,రంగిశెట్టి అర్జున్ రావు,వనిగండ్ల శ్రీనివాసరావు, కంభంపాటి సురేష్,కోలా లింగయ్య లను ఏకగ్రీవంగా గ్రామ పెద్దల సమక్షంలో ఎన్నుకోవడం జరిగింది. నూతన ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులకు గ్రామ సర్పంచ్ వనిగండ్ల అలేఖ్య అశోక్ పంచాయతీ తరపున శుభాకాంక్షలు తెలిపారు.అదేవిధంగా ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం 2023 కు అధ్యక్షునిగా ఉప్పోజి బలవంత చారి ఎన్నిక





మేడిపల్లి, ఆగస్టు 14 (ప్రజాపాలన ప్రతినిధి): సెప్టెంబర్ 17న రాష్ట్రంలో ఘనంగా నిర్వహించే శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్నికి సంబంధించిన శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ సమితి - 2023 కి ఉప్పల్ కు చెందిన ఉప్పోజి బలవంత చారిని అధ్యక్షునిగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ పెద్దలు గౌరవ అధ్యక్షలు లాలుకొట వెంకటా చారి, రాష్ట్ర విశ్వకర్మ,విశ్వబ్రాహ్మణ అధ్యక్షులు వేములవాడ మదన్ మోహన్, ప్రధాన కార్యదర్శి చొల్లేటి క్రిష్ణ మా చారి,కోశాధికారి రగిపని రవీంద్ర చారి,రాష్ట్ర మనుమయ సంఘం అధ్యక్షులు సుంకొజు క్రిష్ణమా చారి, ప్రధాన కార్యదర్శి విష్ణు చారి, రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షులు విజామురి రాఘవ చారి, మరియు మాజీ అధ్యక్షులు శ్రీ రామోజు రవీంద్ర చారి,దేవరకొండ వీరా చారి, ఎరొజు వేణుగోపాల్,బ్రహ్మం,చంద్రశేఖర్ చారి,రామ చారి,చొల్లటి సతీష్ కుమార్,విష్ణు చారి,కమ్మరి వీరేశ్ చారి,కిష్టపురం రావి,జాగ్ జివాన్ చారి,పబ్బొజు బిక్ష పతి,నారొజి రాజరాం చారి,వెంకట చారి,దానకర్ణ చారి,అశోక్ చారి,రావి చారి,సంతోష్ చారి,హరిప్రసాద్,సతిష్,లక్ష్మీ సాయి క్రిష్ణ, సుధాకర్ చారి,అంజనేయలు,యాదగిరి చారి, ఈశ్వర చారి,మల్లా చారి, బ్రహ్మ చారి,ప్రకాశ్ చారి,విష్ణు చారి,భీమ చారి,సురేందర్, బాబూరావు,యాదగిరి, మరియ రాష్ట్రంలో ని వివిధ సంఘాల నాయకులు, కుల పెద్దలు పాల్గొన్నారు.

## చెన్నూరు ఎం ఇ ఓ ను సస్పెండ్ చేయాలి: నేతకాని స్టూడెంట్ ఫెడరేషన్ డిమాండ్



మంచిర్యాల టౌన్, ఆగష్టు 14, ప్రజాపాలన: చెన్నూరు ఎం ఇ ఓ ను సస్పెండ్ చేయాలని నేతకాని స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చెన్నూరు మండలం లోని ప్రైవేటు పాఠశాలల కాసులకు కక్కుర్తి పడి అక్రమాలకు పాల్పడుతున్న చెన్నూరు మండల విద్యాధికారి ని తక్షణమే విధుల నుండి తొలగించి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు క్రాంతి శ్రీను నీతిష్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టుల ఐక్యత చారిత్రక అవసరం

### సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



బోనకల్, ఆగస్టు 14 ప్రజా పాలన ప్రతినిధి : కమ్యూనిస్టుల ఐక్యత చారిత్రక అవసరమని, ఎర్రజెండాలే దేశానికి రక్ష అని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని గోవిందాపురం(ఎల్)లో తమ్మారపు వెంకటకోటయ్య సంస్మరణ సభను సోమవారం నిర్వహించారు. ముందుగా గోవిందాపురం(ఎల్)లో ర్యాలీగా బయలుదేరి ప్రధాన కూడలిలో ఏర్పాటు పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఆవిష్కరించారు. తెలంగాణ అమరవీరుల స్థూపానికి, తమ్మారపు వెంకట కోటయ్య, తమ్మారపు గోవిందు, తమ్మారపు భద్రయ్య, తమ్మారపు భూశయ్య, తమ్మారపు నారాయణ పలువురి స్థూపాలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్లతో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జక్కుల రామారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ఆయన మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, పేదల ప్రజల విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటంలో గోవిందాపురం(ఎల్) గ్రామం కీలకభూమిక పోషిందన్నారు. మండలంలోని ప్రతి కుటుంబానికి పోరాట చరిత్రతో ప్రత్యక్ష, పరోక్షంగా సంబంధం ఉందన్నారు. ఈ మండలంలో ఏ గ్రామానికి వెళ్లిన పోరాట వీరుల జ్ఞాపక స్థూపాలు ఎర్రరంగులో దర్శనమిస్తాయని తెలిపారు. నీతి, నిజాయతీతో కడవరకు కమ్యూనిస్టుగా జీవించిన ధన్యజీవి తమ్మారపు వెంకటకోటయ్య అని కొనియాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ పాలనలో దేశం క్లిష్ట పరిస్థితుల్లో కూరుకుపోయిందని, ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఫాసిస్టు, మతోన్మాద బిజెపిని నిలువరించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజాసమస్యలపై పోరాటాలతో పాటు ఎన్నికల్లోనూ కలిసి పనిచేయాలని, వామపక్షాలు ఐక్యంగా ఉంటే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్రకార్యకమిటి సభ్యులు పొన్నం వెంకటేశ్వరావు, సిఐటియూ రాష్ట్రకార్యదర్శి పాలడుగు భాస్కరరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరావు, ఏపూరి రవీంద్రబాబు, బెజవాడ రవి, కొండపర్తి గోవిందరావు, మందడపు రాణి, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్ కుమార్, పగిడిపల్లి యేసు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, మండల నాయకులు యంగల ఉజ్వల్, రజక సంఘం నాయకులు తమ్మారపు బ్రహ్మం, నల్లమోతు నరసింహారావు, ఏడునూతల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఓపెన్ స్కూల్ అడ్మిషన్ క్యాంపెయిన్

### ఉమ్మడి ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు



బోనకల్ ఆగస్టు 14 ప్రజా పాలన ప్రతినిధి:తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ అడ్మిషన్లకు సంబంధించి, సోమవారం ఉమ్మడి ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు బోనకల్ మండలంలో క్యాంపెయిన్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా మండల తహసిల్దార్ పున్నం చందర్ ని కలిసి వారిచే ఓపెన్ స్కూల్ గోడ పత్రికను ఆవిష్కరించి, అడ్మిషన్ల గురించి తెలియజేయడం జరిగింది.అదేవిధంగా బోనకల్ మండల ఎంపిడిఓ ని,ప్రభుత్వ జూనియర్ కాలేజ్ సిబ్బందిని, కేజీబీవీ బోనకల్ సిబ్బందిని, పీహెచ్సీ బోనకల్ సిబ్బందిని కలిసి అడ్మిషన్ ల గురించి తెలియచేశారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ నందు అడ్మిషన్ పొందుటకు అవకాశం ఈ నెల 31.08.2023 వరకు ఉంది.అనేక కారణాలతో రెగ్యులర్ గా పాఠశాలకు వెళ్లి చదువుకోలేనివారు, వారి వారి పనులు చేసుకుంటూనే ఈ ఓపెన్ స్కూల్లో అడ్మిషన్ పొందవచ్చునని తెలియజేశారు. 14 సంవత్సరాలు వయసు పై బడిన వారు పదవ తరగతికి, 15 సంవత్సరాలు వయసు పై బడిన వారు ఇంటర్మీడియట్ చదువుకొనుటకు అవకాశం ఉందని, కేవలం ఐదు సబ్జెక్టులతో ఇంటర్మీడియట్ , 10వ తరగతి పూర్తి చేయవచ్చునని తెలియజేశారు. ఓపెన్ స్కూల్ అడ్మిషన్ ల కొరకు చైతన్య విద్యాలయం తూటి కుంట్ల ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ షేక్ హుస్సేన్ ను ఫోన్ నంబర్ 9866153580 నందు సంప్రదించగలరని తెలియజేశారు.

## ఆజాది కా అమృత మహోత్సవంలో బిజెపి పార్టీ ర్యాలీ



మధిర ఆగస్టు 14 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలోనా మట్టి నా దేశం కార్యక్రమం లోభాగంగా పట్టణం లో తిరంగా ర్యాలీ నిర్వహించడం జరిగినది. ఈ సందర్బంగా బీజేపీ నాయకులు మాట్లాడుతు, మోడీ పిలుపునందుకుని అమృత్ మహోత్సవల్లో స్వతంత్రం కోసం పోరాడిన యోధులను గుర్తు చేసుకుంటు, వాళ్ళను గౌరవించటం జరిగింది, అలాగే దేశ రక్షణ కోసం, కుటుంబాలకు దూరంగా ఉంటు, తమాప్రాణాలనే పణంగా పెట్టి దేశమత సేవలో పనిచేసి రిటైడ్ అయిన మాజీ సైనికలను, (జవాన్ )లను గుర్తు చేసుకుంటు వాళ్ళను గౌరవించటం లాటి కార్యక్రమాలు చేయటం చాలా సొంతోషం అని, మా చేతులమిదిగా, దేశ సేవా చేసిన పెద్దలను గౌరవించే భాగ్యం కలగాచెసిన ప్రధాని నరేంద్రమోడీ కి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము,ఈ కార్యక్రమం లో బిజెపి జిల్లా కార్యదర్శి లిచిలివేరు సాంబశివరావులి, జిల్లా అధికార ప్రతినిధి లిరామిశెట్టి నాగేశ్వరావు,లి పట్టణం అధ్యక్షులు లిపాపట్ల రమేష్‌లి మండలం అధ్యక్షులు లిగుండా శేఖర్ రెడ్డిలి,జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు లికుంచం కృష్ణారావులి, బీజేవైఎం జిల్లా కార్యదర్శి లికాసిన నాగభూషణం ఎస్సీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి లికనపర్తి ప్రకాష్‌లి,బీజేవైఎం పట్టణ అధ్యక్షులు కే రాము పాల్గొన్నారు

## మండలంలో జోరుగా బీఆర్ఎస్‌లోకి చేరికలు

### పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన జడ్పీ చైర్మన్ కమల్ రాజు, సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ కొండబాల



బోనకల్, ఆగస్టు 14 ప్రజాపాలన ప్రతినిధి: మండల పరిధిలోని చిరునోముల గ్రామంలో ఆదివారం సాయంత్రం వివిధ పార్టీల నుండి సుమారు 70 కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. సీఎం కేసీఆర్ అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్ పార్టీలోకి జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు సమక్షంలో పార్టీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ సీఎం అయిన తర్వాత తెలంగాణ రాష్ట్రం అత్యంత అభివృద్ధి చెందిందని, ఈ అభివృద్ధిని చూసి మధిర నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని, దానిలో భాగంగా చిరునోముల గ్రామంలో 70 కుటుంబాలు చేరడం అభినందనీయం అని పార్టీలో ఉన్న పాతవారు, చేరిన కొత్తవారు కలిసికట్టుగా పనిచేసి బిఆర్ఎస్ పార్టీని బలవపేతం చేయాలని, రానున్న ఎన్నికల్లో మధిర గడ్డపై గులాబీ జెండాను ఎగర వేసి సీఎం కేసీఆర్ కు కానుకగా ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షులు చేబ్రోలు మల్లికార్జునరావు, మండల కార్యదర్శి మోదుగుల నాగేశ్వరరావు, మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, మాజీ జెడ్పిటిసి బానోత్ కొండ, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు గద్దల వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు యంగల కనకయ్య, రజక సంఘం నాయకులు తమ్మారపు బ్రహ్మయ్య, రేగళ్ల వీరయ్య,వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆళ్ళపాడు పాఠశాలలో స్వాతంత్ర దినోత్సవ క్రీడా పోటీలు



బోనకల్, ఆగస్టు 14 ప్రజా పాలన ప్రతినిధి: మండల పరిధిలోని ఆళ్లపాడు గ్రామ కూరకుల వెంకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం విద్యార్దిని విద్యార్థులకు క్రీడలు నిర్వహించడం జరిగింది. ఈ క్రీడలను సర్పంచ్ మర్రి తిరుపతిరావు ప్రారంభించారు. కబ్బడి, కోకో వాలీబాల్ క్రీడలు నిర్వహించారు. ఈ క్రిడలు విద్యార్థులకు ఉల్లాసాన్ని కలిగిస్తూ పోటీతత్వం పెరిగి క్రిడల పట్ల ఆసక్తి పెరిగి మానవ సంబంధాలు మెరుగవుతాయని , శారీరక వికాసానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ మర్రి తిరుపతిరావు, ప్రధానోపాధ్యాయులు ఏ రమేష్ , పి ఈ టి మంద మాధవ రావు, ఉపాధ్యాయులు బి రమేష్ , సుబాని మేడం సరోజినీ పాల్గొన్నారు.

## రూ.3.42 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే ఎంకేఆర్



ఇబ్రహీంపట్నం ఆగస్టు 14 ప్రజాపాలన ప్రతినిధి:ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో వివిధ గ్రామాలు, వార్డులకు చెందిన 6మంది అనారోగ్యంతో ప్రయివేటు ఆసుపత్రిలలో చికిత్స పొంది ఆర్థిక సహాయం నిమిత్తం ఎమ్మెల్యే లిమంచిరెడ్డి కిషన్ రెడ్డి ని సంప్రదించగా ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిది నుండి 3,42,000 రూపాయల విలువ చేసిన చెక్కులను మంజూరు చేయించి అందజేశారు.

లబ్ధిదారుల వివరాలు...

తుర్కయంజాల్ మున్సిపాలిటీ..బ్రహ్మణపల్లికి చెందిన కొనితం కళావతి కి 60,000రూ.,ఇంజాపూర్ కి చెందిన మామిడి శ్రీకాంత్ కి 60,000రూ., యాచారం మండలం మేడిపల్లి నక్కర్త గ్రామానికి చెందిన ముచ్చర్ల భారతమ్మ 60,000రూ., మక్కపల్లి ప్రకాష్ గారికి 28,000రూ., కొంగళ్ల జంగమ్మ గారికి 27,000రూ.అయ్యవారిగూడ గ్రామానికి చెందిన సభావత్ అంజమ్మ కి 31,000రూ.మల్కిజ్ గూడ గ్రామానికి చెందిన డి.నరసింహ గారికి 32,000రూ., ఎం.సత్యనారాయణ కి 28,000రూ., వి.మాధవి కి 16,000రూ.

# పెళ్లికి రెడీ అయిన క్రేజీ హీరో



టాలీవుడ్ యంగ్ హీరో విశ్వక్ సేన్ పెళ్ళికి రెడీ అయినట్లు తెలుస్తుంది. ఈ హీరో.. తన ఇన్‌స్టాలో ఓ పోస్టు పెట్టారు. 'నా పై ప్రేమ చూపించే అభిమానులకు, శ్రేయోభిలాషులకు ఎప్పటికీ రుణపడి ఉంటాను అని, ఇక తన జీవితంలోని మరో ఘటాన్ని తాను ప్రారభించబోతున్నాను అని, తాను నరికొత్త బంధంలోకి అడుగు పెట్టబోతున్నాను అని.. ఓ ఫ్యామిలీని స్టార్ట్ చేయబోతున్నాను అని.. ఆగస్టు 15న అన్ని వివరాలు తెలియజేస్తాను అంటూ విశ్వక్ సేన్ తన పోస్ట్ లో పేర్కొన్నాడు. విశ్వక్ సేన్ చేసిన ఈ పోస్ట్ ను బట్టి.. ఆయన త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నాడని అర్థమవుతుంది. ఇప్పుడున్న సమాచారం ప్రకారం హైదరాబాద్ లోని ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఓనర్ కుమార్తెతో విశ్వక్ సేన్ పెళ్లి ఖాయం అయినట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. పైగా ఆమె విశ్వక్ సేన్ కి స్కూల్ ఫ్రెండ్ అని, వీరిద్దరూ గత కొంత కాలంగా ప్రేమలో ఉన్నారని, విశ్వక్ సేన్ ప్రేమకు ఇరు కుటుంబాలు కూడా అంగీకారం తెలిపాయి అని తెలుస్తోంది. ఐతే, ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తే తప్పితే పూర్తిగా నమ్మలేం. ఇక సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం మూడు సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడు విశ్వక్ సేన్.

# దుల్కర్, రానా అంటే అమ్మాయిలకు పిచ్చి: నాని





యంగ్ టాలెంటెడ్ యాక్టర్ దుల్కర్ సల్మాన్ హీరోగా అభిలాష్ జోషి దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ మూవీ 'కింగ్ ఆఫ్ కోత'. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్ లో నిర్వహించారు. టాలీవుడ్ హీరోలు నాని, రానా దగ్గుబాటి ఈ వేడుకకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ, అమ్మాయిలు విపరీతంగా అభిమానించే ఇద్దరు హీరోలు ఈ స్టేజి మీదనే ఉన్నారంటూ దుల్కర్ సల్మాన్, రానా గురించి ప్రస్తావించాడు. దుల్కర్, రానా అంటే అమ్మాయిలకు పిచ్చి అని నాని చెప్పుకొచ్చాడు. అలాగే, అసలు సిసలైన పాన్ ఇండియా హీరో అంటే దుల్కర్ సల్మానే అంటూ నాని కామెంట్స్ చేశాడు.అలాగే నాని ఇంకా మాట్లాడుతూ.. 'దుల్కర్ కోసం బాలీవుడ్ నుంచి టాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్ వరకు అందరు డైరెక్టర్లు కథలు రాస్తుంటారని చెప్పుకొచ్చాడు. 'సీతారామం' సినిమాతో దుల్కర్ తెలుగువాడయ్యాడని నాని అన్నారు. అన్నట్టు పాన్ ఇండియా స్థాయిలో రూపుదిద్దుకున్న ఈ 'కింగ్ ఆఫ్ కోతా' చిత్రం ఆగస్టు 24న రిలీజ్ కానుంది. ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్ సరసన ఐశ్వర్య లక్ష్మి కథానాయికగా నటించింది. రితికా సింగ్, అనైకా సురేంద్రన్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. ఇక జీ స్టూడియోస్ వారితో కలిసి వెఫేరర్ ఫిలిమ్స్ వారు గ్రాండ్ లెవెల్లో ఈ మూవీని నిర్మించారు. ఈ సినిమాకు జేక్స్ బిజోయ్ సంగీతం అందించాడు.

# సొంత దుకాణంలో నగలు వేసుకోని తమన్నా!



మిల్కీ బ్యూటీ తమన్నా సెకెండ్ ఇన్నింగ్స్ లోనూ దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. సీనియర్ హీరోలకు పర్పెక్ట్ ఛాయిస్ కొత్త జర్నీ సాగిస్తుంది. ఇప్పటికే వెంకటేష్..చిరంజీవి లాంటి స్టార్స్ తో రొమాన్స్ చేసింది. బాలకృష్ణ.. నాగార్జున లాంటి సీనియర్లతోనూ పనిచేస్తే దాదాపు అన్ని తరాల్ని కవర్ చేసిన హీరోయిన్ జాబితాలో చేరిపోతుంది. ఇక అమ్మడు వాణిజ్య ప్రకటనలు చేయడంలో దిట్ట అని కెరీర్ ఆరంభంలోనే నిరూపించుకుంది. ఓ వైపు సినిమాలు..మరో వైపు బ్రాండింగ్స్ ని ఎండార్స్ చేస్తూ రెండు చేతులా సంపాదనే ఆ నాడే ప్రారంభించింది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా యాడ్స్ మాత్రం తప్పకుండా చేసేది. వాటి ద్వారానే కోట్ల ఆదాయం సమకూరేది. అందులోనూ బంగారు ఆభరణాల ప్రచార కార్యక్రమాల్లో తమన్నా ఎంత అందంగా మెరిసిపోయేదో చెప్పాల్సిన పనిలేదు. ఒళ్లంతా బంగారం తో నింపేసిన ఎన్నో ప్రకటనల్లో నటించింది. తమన్నా చీర కట్టి...బంగారు ఆభరణాలు ధరించిందంటే ఆ ఆభరణాలకే వన్నె వచ్చేది. లిస్టర్ గాయని మరి తమన్నా రియల్ లైఫ్ లో బంగారం ధరిస్తుందా అంటే వాటి జోలికే పోదుట. అవును ఈ విషయాన్ని తమన్నా స్వయంగా తెలిపింది. తమన్నా తండ్రికి సొంతంగా బంగారు ఆభరణాల దుకాణాలే ఉన్నాయుట. వాటిలో రకరకాల డిజైన్లు..మోడల్స్ ఉంటాయట. కానీ వాటిని ఏ రోజు ధరించలేదుట. తల్లిదండ్రులు బంగారంతో వేసుకోని బయటకు వెళ్లమంటే అస్సలు ఒప్పుకునేది కాదట. తనకిష్టమైన లంగావోణి ధరించినప్పుడైనా వేసుకోమని బ్రతిమలాడుతారుట. కానీ ససేమీరా ఒప్పుకోదుట. కానీ సంపాదన కోసం బయట దుకాణాల్లో బంగారం ఒళ్లంతా ధరించాల్సి వస్తుందని తెలిపింది. తమన్నా ఇటీవలే రిలీజ్ అయిన జైలర్, భోళా శంకర్ సినిమాల్లో నటించిన సంగతి తెలిసిందే. ఇద్దరు అగ్ర హీరోలతో కలిసి నటించిన సినిమాలు ఒకేసారి రిలీజ్ అవ్వడం విశేషం. అయితే జైలర్ హిట్ టాక్ తెచ్చుకున్నా..భోళా శంకర్ మాత్రం విమర్శలపాలైంది. ఇందులో అమ్మడు చిరంజీవికి జంటగా నటించింది.

# 'డబుల్ ఇస్మార్ట్' పై మరో క్రేజీ అప్ డేట్




ఎనర్జిటిక్ యాక్టర్ రామ్ పోతినేని – డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ మరోసారి ఇస్మార్ట్ శంకర్ సీక్వెల్ 'డబుల్ ఇస్మార్ట్' కోసం జతకడుతున్న సంగతి తెలిసిందే. ఔట్ అండ్ ఔట్ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ గా రాబోతున్న ఈ చిత్రం షూటింగ్ థాయిలాండ్ లో స్టార్ట్ అయిన సంగతి తెలిసిందే. కాగా ఈ షూటింగ్ లో ఇంటర్వెల్ సీక్వెన్స్ ను షూట్ చేస్తున్నారు. సంజయ్ దత్ విలన్ పాత్ర ఈ సీక్వెన్స్ లోనే రివీల్ అవుతుందని.. రామ్ పై అటాక్ చేస్తూ.. సంజయ్ దత్ చాలా వైల్డ్ గా ఈ సీక్వెన్స్ లో కనిపిస్తాడని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సీన్స్ నే షూట్ చేస్తున్నారు.ఈ సినిమా మహా శివరాత్రి సందర్భంగా మార్చి 8, 2024న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం మరియు హిందీ భాషల్లో విడుదల కానుంది. పూరి జగన్నాథ్ మరియు ఛార్మి కౌర్ కలిసి పూరీ కనెక్ట్స్‌పై, విషు రెడ్డి సీఈవోగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఇస్మార్ట్ శంకర్ రామ్ కెరీర్ లోనే అత్యధిక వసూళ్లు రాబట్టింది. మరి డబుల్ ఇస్మార్ట్ ఏ రేంజ్ లో సక్సెస్ అవుతుందో చూడాలి.

# రష్మికకి డిసెంబర్ సెంటిమెంట్ కలిసొచ్చేనా..?



సినిమా వాళ్ల సెంటిమెంట్స్ గురించి తెలిసిందే. ప్రారంభోత్సవం నుంచి రిలీజ్ వరకూ ప్రతీది ముహూర్తం తోనే ముడిపడి ఉంటుంది. హీరోలు..నిర్మాతలు ఈ సెంటిమెంట్ ని ఎప్పుడూ బ్రేక్ చేయరు. తాజాగా నేషనల్ క్రష్ బ్యూటీ రష్మిక మందన్న కూడా అలాంటి ఓ సెంటిమెంట్ ఉందని తెలుస్తోంది. ఈ సెంటిమెంట్ తనకు తానుగా పెట్టుకుంది కాదు..అనుకోకుండా చోటు చేసుకున్న సెంటిమెంట్. కానీ ఇప్పుడది ప్రత్యేక సెంటిమెంట్ గానూ మారినట్లు కనిపిస్తుంది. ఏడాదిలో అమ్మడు డిసెంబర్ నెల అతి పెద్ద సెంటిమెంట్ గా తెలుస్తుంది. రష్మిక తొలి చిత్రం 'కిరిక్ పార్టీ' డిసెంబర్ 31న రిలీజ్ అయి కన్నడలో సూపర్ హిట్ అయింది. అటుపై రెండవ సినిమా 'అంజనిపుత్ర' కూడా డిసెంబర్‌లోనే రిలీజై విమర్శకుల ప్రశంసలందుకుంది. ఇక ఎలాంటి అంచనాలు లేకుండా పాన్ ఇండియాలో రిలీజ్ అయిన పుష్ప కూడా డిసెంబర్ లోనే ప్రేక్షకుల ముందుకొచ్చి బ్లాక్ బస్టర్ అయింది. డిసెంబర్ 17న ఈ సినిమా రిలీజ్ అయింది. ఈ సినిమా రష్మికకి పాన్ ఇండియాలో క్రేజ్ తీసుకొచ్చింది. ఆ సక్సెస్ తో బాలీవుడ్ లోనూ అవకాశాలు అందుకుంటుంది. అమితాబ్ బచ్చన్ తో కలిసి రష్మిక నటించిన తొలి హిందీ చిత్రం గుడ్‌నైట్ కూడా డిసెంబర్‌లో విడుదలై పేరు తెచ్చిపెట్టింది. ప్రస్తుతం రష్మిక హిందీలో రణబీర్ కపూర్ సరసన 'యానిమల్'లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం కూడా డిసెంబర్ 1న విడుదల అవుతుంది. దీంతో ఈ సినిమా విజయంపైనా అమ్మడు ధీమాగా ఉంది. కలిసొచ్చిన డిసెంబర్ నెల తనని మరో స్థాయికి తీసుకెళ్లుందని ఆశాభావం వ్యక్తం చేసింది. యానిమల్ పై భారీ అంచనాలున్నాయి. అర్జున్ రెడ్డి తర్వాత సందీప్ రెడ్డి వంగ తెరకెక్కిస్తోన్న సినిమా కావడంతో ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. ప్రస్తుతం రష్మిక తెలుగులో పుష్ప 2, రెయిన్ బో చిత్రాల్లో నటిస్తోన్న సంగతి తెలిసిందే.

# మహేశ్ కోసం రూ.4కోట్ల భారీ సెట్..



సూపర్ స్టార్ మహేశ్ బాబు హీరోగా మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా గుంటూరు కారం. భారీ బడ్జెట్‌తో కంప్లీట్ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఈ సినిమా రాబోతుంది. అయితే ఈ సినిమా మొదటి నుంచి కష్టాలను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. సినిమాలోని నటీనటులు, టెక్నిషియన్స్.. బిగ్‌బాస్ హౌస్ కెంటెస్టెంట్ తరహాలో ఒక్కొక్కరుగా ఎలిమినేట్ అవుతూ వస్తున్నారు. దీంతో మూవీ షూటింగ్ బ్రేక్ పడుతూ వస్తోంది. అయితే తాజాగా ఈ సినిమా షూటింగ్ ఎట్టకేలకు ప్రారంభం కానుందని తెలిసింది. ఫ్యామిలీతో కలిసి రెండు వారాల క్రితం ఫారెన్ టూర్‌లో మహేశ్ బాబు తిరిగి వచ్చేస్తున్నారట. దీంతో ఆగస్ట్ 16నుంచి కొత్త షెడ్యూల్ ప్రారంభించేందుకు మూవీటీమ్ సన్నాహాలు చేస్తున్నారని సమాచారం అందింది. మహేశ్ రాగానే సెట్స్‌లో జాయిన్ అవ్వనున్నారు. అలాగే ఇటీవలే సినిమాటోగ్రాఫర్ పీఎస్ వినోద్ తప్పుకున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో కొత్త సినిమాటోగ్రాఫర్‌గా బాధ్యతలు ఎవరు తీసుకుంటారా అని ఆసక్తి మొదలైంది. తాజాగా దీనిపై కూడా ఓ క్లారిటీ వచ్చింది. పీఎస్ వినోద్ స్థానంలో మనోజ్ పరమహంస కొత్త సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించనున్నారని సమాచారం. ఆగస్ట్ 16న ఈయనతో షూటింగ్ చేయబోతున్నారట. మరో ఆసక్తికర విషయమేమిటంటే.. సాధరణంగా త్రివిక్రమ్ సినిమా అంటే సెట్స్ ఎంత క్లాస్ అండ్ కాస్ట్లీగా ఉంటాయో తెలిసిన విషయమే. ఇప్పుడు ఈ కొత్త షెడ్యూల్ కోసం ఓ స్పెషల్ సెట్ వేయబోతున్నారట. ఓ ప్రైవేట్ స్టూడియోను అద్దెకు తీసుకుని అందులో దాదాపు రూ. 4కోట్లు ఖర్చు పెట్టి మరీ భారీ సెట్ నిర్మించబోతున్నట్లు తెలిసింది. ఎంతో ప్రత్యేకంగా ఈ సెట్‌ను తీర్చిదిద్దుతున్నారట. ఇందులోనే కొత్త షెడ్యూల్ చిత్రకరించనున్నారని సమాచారం అందింది. ఇకపోతే ఈ సినిమాలో హీరోయిన్లుగా శ్రీలీల, మీనాక్షి చౌదరి నటిస్తున్నారు. ఈ ఇద్దరితో పాటు సినిమాలోని ఇతర కీలక పాత్రలపై ఈ కొత్త షెడ్యూల్‌లో చిత్రీకరణ జరపనున్నారట. తమన్ సినిమకు స్వరాలు సమకూరుస్తున్నారు. ఇప్పటికే రీసెంట్‌గా మహేశ్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన రెండు కొత్త మాస్ పోస్టర్లు మహేశ్ అభిమానులను బాగా ఆకట్టుకున్నాయి. సినిమాను హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు.






Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2/29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989